


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 25-11-2025 | సంపుటి - 25 | సంచిక -189 | రూ : 4 | పేజీలు: 8


## బాబోయ్.. బయో

- రోజుకు 31.27 టన్నుల వ్యర్థాల ఉత్పత్తి
- నిబంధనలు పాటించని 141 ఆసుపత్రులకు నోటీసులు
- పీసీబీ వార్షిక నివేదికలో కీలక విషయాలు



2లో



## దిల్లీకి నొయిడా..
# తెలంగాణకు కొడంగల్

- అంతర్జాతీయ స్థాయిలో లగచర్ల పారిశ్రామికవాడ
- మహిళల ఉత్పత్తుల విక్రయానికి అమెజాన్‌తో సంప్రదింపులు
- కొడంగల్ సభలో సీఎం రేవంత్‌రెడ్డి
- సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ నిర్మాణానికి భూమిపూజ



2లో

## అమెరికా ఆంక్షలు.. భారీ డిస్కౌంట్‌తో
# భారత్‌కు రష్యా చమురు

- నవంబర్ 21 నుంచి రష్యా సంస్థలపై అమెరికా ఆంక్షలు
- గత రెండేళ్లలో ఎన్నడూ లేనంత తగ్గింపుకు చమురు
- బ్యారెల్‌కు ఏడు డాలర్ల వరకు తగ్గింపు ధర

2లో



## కొత్త సీజేఐ కోసం అధికారిక కారును రాష్ట్రపతి భవన్ వద్ద
# వదిలి వెళ్లిన జస్టిస్ గవాయ్

- 53వ ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ సూర్యకాంత్
- అధికారిక కారులో రాష్ట్రపతి భవన్‌కు వచ్చిన జస్టిస్ గవాయ్
- జస్టిస్ సూర్యకాంత్ బాధ్యతలు చేపట్టాక

2లో



కారును అక్కడే వదిలిన గవాయ్




2లో

## ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి కార్యక్రమం
# ప్రజల్లోకి వెళ్లాలి

ప్రజలకు మరింత మెరుగ్గా పౌరసేవలు అందించాలని అధికారులకు సీఎం ఆదేశం

- గ్రామ, వార్డు సభల ఆమోదం లేకుండా ఏ పనులూ చేపట్టవద్దని స్పష్టీకరణ
- వాతావరణ సమాచారం సహా 42 అంశాలతో 'అవేర్' యాప్ విడుదలకు నిర్ణయం
- సుపరిపాలనపై ఎమ్మెల్యేలు, ఎంపీలకు డిసెంబరులో ప్రత్యేక వర్క్‌షాప్
- ప్రభుత్వ పథకాల అమలులో జవాబుదారీతనం అత్యంత కీలకమని వెల్లడి

## బంగాళాఖాతంలో రెండు అల్పపీడనాలు

- రెండు రోజుల్లో తుపాను ఏర్పడే అవకాశం

2లో



2లో



## కేసు రాజీ జరుగుతుంటే..
# మీరేం చేశారు?

- తితిదే పూర్వ వీజీవో గిరిధర్‌పై సీఐడీ బృందం ప్రశ్నల వర్షం
- 'పరకామణి' కేసు దర్యాప్తు వేగవంతం

# స్పామ్ కాల్స్‌పై ట్రాయ్ ఉక్కుపాదం... 21 లక్షల మొబైల్ నంబర్లు కట్!

దేశంలో స్పామ్, మోసపూరిత కాల్స్‌ను అరికట్టేందుకు టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) భారీ చర్యలు చేపట్టింది. గడిచిన ఏడాది కాలంలో ఏకంగా 21 లక్షలకు పైగా మొబైల్ నంబర్లను డిస్‌కనెక్ట్ చేయడంతో పాటు, మోసాలకు పాల్పడుతున్న సుమారు లక్ష సంస్థలను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టినట్లు కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగానే ఈ కఠిన చర్యలు తీసుకున్నట్లు ట్రాయ్ స్పష్టం చేసింది. టెలికాం సేవలు దుర్వినియోగం కాకుండా నిరోధించేందుకు, ప్రజలు తమకు వచ్చే స్పామ్ కాల్స్, మెసేజ్‌ల వివరాలను 'ట్రాయ్ డీఎన్‌డీ' యాప్ ద్వారా రిపోర్ట్ చేయాలని కోరింది. చాలా మంది వినియోగదారులు తమ ఫోన్లలో అనవసర నంబర్లను బ్లాక్ చేస్తే సరిపోతుందని భావిస్తారని, కానీ అది సరైన పద్ధతి కాదని ట్రాయ్ పేర్కొంది. నంబర్‌ను బ్లాక్ చేయడం వల్ల ఆ కాల్స్ వ్యక్తిగతంగా మనకు రాకుండా ఉంటాయి తప్ప, మోసగాళ్లు ఇతరులను లక్ష్యంగా చేసుకోవడాన్ని ఆపలేమని వివరించింది. అదే డీఎన్‌డీ యాప్‌లో ఫిర్యాదు చేయడం ద్వారా టెలికాం సర్వీస్ ప్రొవైడర్లు ఆ నంబర్‌ను గుర్తించి, దానిని శాశ్వతంగా నిలిపివేస్తారు. గతేడాది ఇంత పెద్ద సంఖ్యలో నంబర్లపై చర్యలు తీసుకోవడానికి లక్షలాది మంది పౌరులు డీఎన్‌డీ యాప్‌ను ఉపయోగించడమే కారణమని ట్రాయ్ తెలిపింది. ఆర్థిక మోసాలు, సైబర్ నేరాల బారిన పడితే వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కి లేదా cybercrime.gov.in పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించింది. అలాగే 'సంచార్ సాథీ' పోర్టల్‌లోని 'చక్షు' ద్వారా కూడా టెలికాం సంబంధిత మోసాలను రిపోర్ట్ చేయవచ్చు. ముఖ్యంగా సీనియర్ సిటిజన్లు, మహిళలు, డిజిటల్ లావాదేవీలపై అవగాహన తక్కువగా ఉన్న వారు అప్రమత్తంగా ఉండాలని ట్రాయ్ హెచ్చరించింది.

## అమెరికా ఆంక్షలు..
## భారీ డిస్కౌంట్‌తో భారత్‌కు రష్యా చమురు

రష్యా చమురుపై అమెరికా ఆంక్షలు విధించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో, భారత్ కు భారీ డిస్కౌంట్‌తో ఆయిల్ విక్రయించేందుకు రష్యా సిద్ధమైంది. రష్యా అగ్రశ్రేణి చమురు ఉత్పత్తి సంస్థలైన రాస్‌నెఫ్ట్, లుకోయిల్‌లపై అమెరికా విధించిన ఆంక్షలు అమలులోకి వచ్చాయి. దీంతో క్రూడాయిల్ ధరలు భారీగా పతనమయ్యాయి. ఫలితంగా రష్యా నుంచి భారత్‌కు సరఫరా అయ్యే ముడి చమురు ధరలు గత రెండేళ్లలో ఎన్నడూ లేనంత తక్కువకు చేరాయి. అమెరికా ఆంక్షలు రష్యా చమురు వ్యాపారంపై తీవ్ర ప్రభావం చూపాయి. దీంతో రష్యా ప్రధాన చమురు ఉరల్స్‌ను డెలివరీ ఆధారంగా బ్రెంట్ ముడి చమురు కంటే బ్యారెల్‌కు ఏడు డాలర్ల వరకు తగ్గింపుతో భారత రిఫైనరీలకు అందించేందుకు రష్యా సిద్ధమైంది. ఆంక్షలు లేనప్పుడు ఈ తగ్గింపు మూడు డాలర్లుగా ఉండగా, ఇప్పుడు రెండింతలు అయింది. తాజా తగ్గింపు ధరతో వచ్చే చమురు డిసెంబర్ నెలలో లోడ్ అయి జనవరిలో భారత్‌కు చేరే అవకాశం ఉంది. మూడేళ్ల క్రితం ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ప్రారంభించిన తర్వాత నుంచి తక్కువ ధరల కారణంగా రష్యా చమురును భారత్ కొనుగోలు చేస్తోంది. నవంబర్ 21 నుంచి అమెరికా ఆంక్షలు అమల్లోకి రావడంతో భారతీయ రిఫైనరీలు రష్యా చమురు ఆర్డర్లను కొంతకాలం నిలిపివేశాయి. ఈ వారంలో ఉరల్స్ చమురు ధర భారీగా తగ్గడంతో భారత రిఫైనరీలు తిరిగి కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపాయి. ఆంక్షలు లేని సంస్థల నుంచి చమురు కొనుగోలుకు సిద్ధమయ్యాయి.

# బంగాళాఖాతంలో రెండు అల్పపీడనాలు

విశాఖపట్నం : బంగాళాఖాతంలో నెలకొంటున్న పరిస్థితులు వాతావరణ నిపుణులను ఆశ్చర్యపరుస్తున్నాయి. ఒక అల్పపీడనం కొనసాగుతుండగానే.. మరోటి ఏర్పడే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ రెండు అల్పపీడనాలూ మనుగడ కోసం పోటీ పడనున్నాయి. రాబోయే రోజుల్లో రెండూ కలిసిపోయే అవకాశముంది. మలక్కా జలసంధి సమీపంలో ప్రస్తుతం తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. ఇది పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ మంగళవారం నాటికి వాయుగుండంగా, గురువారంలోగా తుపానుగా బలపడుతుందని భారత వాతావరణ విభాగం అంచనా వేస్తోంది. ఇది తుపానుగా బలపడేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. తదుపరి కదలికలపై మరింత స్పష్టత రావాల్సి ఉంది. గత గణాంకాల ప్రకారం.. నవంబరులో ఏర్పడే తుపాన్లు చాలావరకు పశ్చిమబెంగాల్, బంగ్లాదేశ్ వైపు వెళుతుంటాయి. కొన్ని మాత్రం ఏపీ, తమిళనాడు తీరాలను తాకాయి. సాధారణంగా అల్పపీడనం ఏర్పడ్డాక దాని గమనంపై దాదాపు స్పష్టత వస్తుంది. ఇప్పటివరకు దీనిపై సరైన స్పష్టత లేదని, తుపానుగా బలపడిన తర్వాతే దీని దిశ, గమనం, తీరాన్ని తాకే కేంద్రంపై అంచనాకు రాగలమని నిపుణులు తెలిపారు.

**29 తర్వాత భారీ వర్షా లు**

కొమొరిన్ ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో మంగళవారం నైరుతి బంగాళాఖాతంలో కొమొరిన్, శ్రీలంక పరిసరాల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని ఐఎండీ తెలిపింది. తర్వాత ఇది మరింత బలపడుతుందని అంచనా వేస్తోంది. వీటి ప్రభావంతో మంగళ, బుధవారాల్లో కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురవొచ్చని ఐఎండీ తెలిపింది. 29న రాయలసీమ, దక్షిణ కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు, 30న బాపట్ల, ప్రకాశం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, వైఎస్సార్ కడప, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తోంది. సముద్రం అలజడిగా మారనున్న నేపథ్యంలో గురు, శుక్రవారాల్లో మత్స్యకారులు వేటకు వెళ్లరాదని సూచించింది. ఇప్పటికే వెళ్లిన మత్స్యకారులు గురువారం లోగా ఒడ్డుకు చేరుకోవాలని విజ్ఞప్తి చేసింది. మలక్కా జలసంధి సమీపంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం.. వాయుగుండంగా బలపడుతుందని, ఈ నెల 30 నాటికి బలహీనపడుతుందని పలు వాతావరణ నమూనాలు అంచనా వేస్తున్నాయి. కొమొరిన్ ప్రాంతంలో ఏర్పడనున్న అల్పపీడనం తర్వాత బలపడుతుందని, డిసెంబరు 1 నాటికి తమిళనాడు, దక్షిణ కోస్తా మధ్యలో తీరం దాటుతుందని సూచిస్తున్నాయి.

## కొత్త సీజేఐ కోసం అధికారిక కారును రాష్ట్రపతి భవన్ వద్ద వదిలి వెళ్లిన జస్టిస్ గవాయ్

సుప్రీంకోర్టు మాజీ సీజేఐ జస్టిస్ గవాయ్ తన అధికారిక కారును నూతన సీజేఐగా బాధ్యతలు స్వీకరించిన జస్టిస్ సూర్యకాంత్ కోసం రాష్ట్రపతి భవన్ వద్ద వదిలి వెళ్లినట్లు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. సుప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ సోమవారం ప్రమాణం స్వీకారం చేసిన విషయం విదితమే. ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం జస్టిస్ గవాయ్ తాను వచ్చిన వాహనాన్ని అక్కడే వదిలి వెళ్లిపోయారు.నింధనల ప్రకారం, సీజేఐగా పదవీ విరమణ చేసిన తర్వాత మాజీ సీజేఐలు తమ అధికారిక నివాసాలను, సీజేఐకి కేటాయించే ఇతర సౌకర్యాలను తిరిగి అప్పగించాల్సి ఉంటుంది. అందులో భాగంగానే జస్టిస్ గవాయ్ తన వాహనాన్ని జస్టిస్ సూర్యకాంత్ కోసం రాష్ట్రపతి భవన్ వద్ద విడిచిపెట్టినట్లు సమాచారం. ఈ సంవత్సరం మే 14న 52వ సీజేఐగా బాధ్యతలు స్వీకరించిన జస్టిస్ బీ.ఆర్. గవాయ్ పదవీకాలం ముగియడంతో సోమవారం నూతన సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణం చేశారు. దీనితో సీజేఐగా బాధ్యతలు చేపట్టిన తొలి హర్యానా రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా ఆయన రికార్డు సృష్టించారు. 2027 ఫిబ్రవరి 9 వరకు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు.

## పంచాయతీ ఎన్నికలు..
# అభ్యర్థులకు కేరళలోని రైతు సంఘం షరతు

కేరళలో డిసెంబర్ నెలలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఈ క్రమంలో కేరళ స్వతంత్ర రైతు సంఘం (కేఐఎఫ్ఏ) రాజకీయ నాయకుల ముందు ఒక డిమాండ్ ఉంచింది. తమ డిమాండుతో కూడిన లేఖపై సంతకం చేస్తేనే ఓట్లు వేస్తామని షరతు విధించింది. అడవి జంతువుల దాడుల నుంచి రైతుల ఆత్మరక్షణ హక్కును సమర్థిస్తూ రాతపూర్వక అఫిడవిట్‌పై సంతకం చేయాలని, లేదంటే స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తామని స్పష్టం చేసింది. క్రూర మృగాల నుంచి స్వీయ రక్షణ కోసం ఒక్కోసారి వాటిపై దాడి చేసి, చంపాల్సి వస్తోందని, అలాంటి సమయాల్లో రైతుల స్వీయ రక్షణ హక్కుకు మద్దతు ఇస్తున్నట్లు రూపొందించిన రాతపూర్వక అఫిడవిట్‌పై సంతకాలు చేయాలని రైతు సంఘం ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులను కోరింది. వన్యప్రాణుల రక్షణ చట్టం ప్రకారం అటవీ ప్రాంతం వెలుపల వన్యప్రాణులు దాడి చేస్తే ప్రాణరక్షణలో భాగంగా వాటిని చంపినా, గాయపరిచినా వారికి ఎటువంటి శిక్ష పడదు. అయితే, చట్టవిరుద్ధంగా వన్యప్రాణులను వేటాడి, చంపితే ఈ రక్షణ వర్తించదు. కొన్ని సందర్భాల్లో దాడి చేసిన వన్యప్రాణులను చంపినప్పటికీ వేటాడుతున్నట్లు ఆరోపిస్తూ కేసులు నమోదు చేస్తున్నారని రైతు సంఘం ఆరోపించింది. అందుకే జంతువుల దాడి నుంచి తప్పించుకోవడానికి రైతుల ఆత్మరక్షణ హక్కుకు మద్దతిచ్చేలా తమ అఫిడవిట్‌పై సంతకాలు చేయాలని పేర్కొంది. 'అడవి జంతువుల దాడిలో రైతుల పక్షాన నిలబడని వారికి ఓటు వేయబోం' అనే నినాదంతో ఈ రైతు సంఘం బోర్డులను కూడా ఏర్పాటు చేసి, గ్రామాల్లో అవగాహన పెంచుతోంది.

## దిల్లీకి నొయిడా..
# తెలంగాణకు కొడంగల్

దిల్లీకి నోయిడా ఎలాగో... తెలంగాణకు కొడంగల్ అలాగేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. లగచర్ల పారిశ్రామికవాడను అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దుతామని చెప్పారు. సోమవారం వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో రూ.103 కోట్ల అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. విద్యార్థుల మధ్యాహ్న భోజనం తయారీకి అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సెంట్రలైజ్‌డ్ కమ్యూనిటీ కిచెన్ నిర్మాణానికి మంత్రులు దామోదర్ రాజనర్సింహ, వాకిటి శ్రీహరిలతో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం విద్యార్థులకు స్వయంగా వడ్డించారు. మద్దూరు మహిళా సమాఖ్యకు చెందిన ఆర్టీసీ బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం ప్రసంగించారు. ''కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్లలో పారిశ్రామికవాడ ఏర్పాటుకు భూసేకరణకు ప్రయత్నిస్తే కొందరు గిట్టనివారు రైతులను రెచ్చగొట్టారు. అధికారులపై దాడులు చేయించి... వారిపై కేసులయ్యేలా చేశారు. అన్నదాతలతో మాట్లాడి... పరిహారం, ఇందిరమ్మ ఇళ్లు కేటాయించి లగచర్ల, హకీంపేట, పోలేపల్లిల్లో మూడు వేల ఎకరాలను సేకరించాం.

**ఆడబిడ్డల సంతోషంతోనే ఆర్థిక వృద్ధి**

ఆడబిడ్డలు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం ఆర్థిక వృద్ధి సాధిస్తుంది. వారు ఆత్మగౌరవంతో జీవించాలనే ఉద్దేశంతో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడంతో పాటు బస్సులకు యజమానులను చేశాం. అంబానీ అదానీలతో పోటీపడేలా సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నాం. హైదరాబాద్‌లోని శిల్పారామంలో రూ.వందల కోట్ల విలువైన 3 ఎకరాల్లో మహిళలు తయారు చేసిన ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం స్టాళ్లు ఏర్పాటు చేశాం. అంతర్జాతీయ మార్కెట్‌లో ఉత్పత్తులు విక్రయించేందుకు అమెజాన్‌తో సంప్రదింపులు చేస్తున్నాం.

**16 నెలల్లో విద్యా హబ్‌గా..**

2034 కల్లా కొడంగల్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రాష్ట్రానికి నమూనాగా మారుస్తాం. వచ్చే 16 నెలల్లో కొడంగల్‌ను అంతర్జాతీయ స్థాయి విద్యా హబ్‌గా మార్చాలని ప్రయత్నాలు చేస్తున్నాం. రాష్ట్రం నలుమూలల నుంచి చదువుల కోసం ఇక్కడికే వచ్చేలా చేస్తాం. ఇంజినీరింగ్, నర్సింగ్ కళాశాలలను ఏర్పాటు చేశాం. మెడికల్, వెటర్నరీ, వ్యవసాయ, పారామెడికల్, ఏటీసీలతో పాటు జూనియర్, డిగ్రీ కాలేజీలకు భవనాలను మంజూరు చేశాం. రాష్ట్రంలో నెలకొల్పబోయే సైనిక్ స్కూల్‌ను తీసుకొచ్చాం. కొడంగల్ ప్రజల 70 ఏళ్ల నాటి కల నెరవేరబోతోంది. మరో 9 నెలల్లో రైల్వే లైన్ పనులు ప్రారంభం కాబోతున్నాయి. దేశ తొలి ప్రధాని నెహ్రూ ఆధ్వర్యంలో ఎన్నో ప్రాజెక్టులు, విద్యాసంస్థలు కొలువుదీరాయి. అదే స్ఫూర్తితో విద్య, నీటిపారుదలకు ప్రాధాన్యమిస్తున్నాం. మూడేళ్లలో కొడంగల్ నారాయణపేటమక్తల్ ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి... కొడంగల్ ప్రాంత భూములను కృష్ణా జలాలతో తడుపుతాం. దీనికి 95 శాతం రైతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి భూములు ఇచ్చారు. ఏ విద్యార్థీ ఆకలితో బాధపడకూడదన్న ఉద్దేశంతో అక్షయ పాత్ర ఆధ్వర్యంలో కొడంగల్ నియోజకవర్గంలోని 312 పాఠశాలల్లో 28 వేల మంది విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నాం. మధ్యాహ్న భోజనం కూడా అందించేందుకు వంటశాల నిర్మిస్తున్నాం'' అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ మార్పు రావాలంటే ఆడపిల్లలు చదువుకోవాలని... అప్పుడే తల్లిగా, భార్యగా, చెల్లిగా, బిడ్డగా, కోడలిగా కుటుంబాన్ని సమర్థంగా నడుపుతారని చెప్పారు. పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. రూ.4,500 కోట్లతో గంగమ్మను ఇక్కడికి తరలించేందుకు సీఎం కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని చేపడుతున్నారని అన్నారు.

# ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి కార్యక్రమం ప్రజల్లోకి వెళ్లాలి

రాష్ట్రంలో ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సమర్థవంతంగా, వేగంగా అందించాలని, సుపరిపాలన ద్వారా ప్రజల సంతృప్తి స్థాయిని పెంచడమే లక్ష్యంగా పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టే అభివృద్ధి పనులకు స్థానిక ప్రజాసంస్థల ఆమోదం తప్పనిసరి అని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (నరేగా) పనులకు సైతం ఇదే నిబంధన వర్తిస్తుందని ఆయన స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీ) కేంద్రంలో వివిధ శాఖల పనితీరుపై ముఖ్యమంత్రి ఉన్నతాధికారులతో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి కార్యక్రమం ప్రజల్లోకి సమర్థంగా వెళ్లాలని, దీని కోసం మంత్రులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించాలని సూచించారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ప్రజామోదం మేరకే పనులు చేపట్టాలని, అదేవిధంగా గ్రామాల్లో గ్రామసభల అనుమతి లేకుండా ఎటువంటి పనులూ ప్రారంభించవద్దని కఠిన ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ పథకాల అమలు నుంచి పౌరసేవల లభ్యత వరకు ప్రతి అంశంలోనూ జవాబుదారీతనం అత్యంత కీలకమని, దీనిపై నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాలనా సామర్థ్యాన్ని పెంచేందుకు రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ప్రత్యేకంగా 'కెపాసిటీ బిల్డింగ్' కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో సానుకూలత పెరిగేలా సూక్ష్మస్థాయిలో విశ్లేషణ జరగాలని సీఎం అన్నారు. ఇటీవల మొక్కజొన్న, పత్తి, అరటి రైతులు ఎదుర్కొన్న సమస్యలను ప్రభుత్వం సమర్థంగా పరిష్కరించి గిట్టుబాటు ధర కల్పించిందని గుర్తుచేశారు. ఆర్థిక, ఆర్థికేతర అంశాలను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయడం ద్వారా ప్రజల్లో సానుకూల దృక్పథం పెరుగుతుందని, డేటా ఆధారిత నిర్ణయాలతో ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

*** త్వరలో 'అవేర్' యాప్.. సాంకేతికతకు పెద్దపీట**

ప్రభుత్వ పాలనలో సాంకేతికత వినియోగాన్ని మరింత పెంచాలని ముఖ్యమంత్రి ఉద్ఘాటించారు. వాతావరణ హెచ్చరికలతో పాటు మొత్తం 42 రకాల కీలక సమాచారాన్ని ప్రజలకు నిరంతరం అందించేందుకు 'అవేర్ (AWARE)' యాప్‌ను త్వరలో విడుదల చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ శాఖలన్నీ 'డేటా లేక్'కు అనుసంధానం కావాలని, రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లోనూ ఇంటర్నెట్ బ్యాండ్‌విడ్త్ పెంచేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ హాస్టళ్లలో తాగునీరు, పారిశుద్ధ్యం వంటి అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని, ఇందుకోసం రూపొందించిన యాప్ ద్వారా రోజువారీ తనిఖీలు చేస్తున్నామని అధికారులు సీఎంకు వివరించారు. తిరుమలలో భక్తులకు టీటీడీ అందిస్తున్న సేవలు, క్రౌడ్ మేనేజ్‌మెంట్, భద్రతా ఏర్పాట్లను అధ్యయనం చేసి, ఆ నమూనాను ఇతర ప్రధాన దేవాలయాల్లోనూ అమలు చేయాలని సూచించారు. కాలుష్య నియంత్రణ మండలి సహకారంతో ఎయిర్ క్వాలిటీ సెన్సార్లు ఏర్పాటు చేసి, ఆ వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. సుపరిపాలన అంశాలపై డిసెంబరులో ఎమ్మెల్యేలు, ఎంపీలతో ఒక ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహిస్తామని, అధికారుల్లో పాలనా నైపుణ్యాలు పెంచేందుకు శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

# కేసు రాజీ జరుగుతుంటే.. మీరేం చేశారు?

తిరుపతి : ''పరకామణిలో కానుకల చోరీకి పాల్పడ్డ రవికుమార్ ఎన్ని విదేశీ కరెన్సీ నోట్లు మీకు అప్పగించారు? ఎక్కడో ఉన్న అప్పటి ఏవీఎస్‌వో సతీష్‌కుమార్‌ను పిలిచి ఫిర్యాదు ఇమ్మని చెప్పడం వెనక ఎవరున్నారు? దర్యాప్తు గురించి మీకు ఏమి తెలుసు? ప్రభుత్వ ఉద్యోగైన సతీష్‌కుమార్ పరకామణి కేసును లోక్ అదాలత్‌లో రాజీ చేసుకుంటుంటే మీరేం చేశారు?'' అని సీఐడీ బృందం అప్పటి తితిదే వీజీవో గిరిధర్‌ను ప్రశ్నించింది. సోమవారం తిరుపతి పద్మావతి అతిథిగృహంలో సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ దర్యాప్తు బృందంతో కలిసి విచారించారు. హైకోర్టు ఆదేశాల మేరకు పరకామణిలో కేసు దర్యాప్తు చేపట్టిన సీఐడీ బృందం డిసెంబరు 2వ తేదీలోగా నివేదిక ఇచ్చేందుకు విచారణ చేపట్టింది. అదే సమయంలో విచారణ నిమిత్తం వస్తున్న ఏవీఎస్‌వో సతీష్‌కుమార్ మృతి చెందారు. దీంతో దర్యాప్తులో జాప్యం చోటుచేసుకుంది. సోమవారం తిరుపతికి చేరుకున్న సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ స్వయంగా విచారణ చేపట్టారు. అప్పటి తితిదే వీజీవో గిరిధర్‌ను విచారించారు. పరకామణి అధికారులు మొదట మీకు సమాచారమిచ్చారా అని ఆరా తీశారు. చోరీపై తితిదే విజిలెన్స్ విభాగం ఎలాంటి విచారణ చేపట్టింది, సంబంధిత దస్త్రాలు, ఇతర వివరాలు ఎవరికి సమర్పించారని అడిగినట్లు సమాచారం. తాము సేకరించిన విషయాలు అప్పటి సీవీఎస్‌వో నరసింహకిశోర్‌కు తెలియజేసినట్లు గిరిధర్ చెప్పినట్లు తెలిసింది. అలాగే కేసు రాజీలో సతీష్‌కుమార్‌కు ఏమైనా సలహాలు ఇచ్చారా? ఆయనపై ఎవరిదైనా ఒత్తిడి ఉన్నట్లు గుర్తించారా? అని ప్రశ్నించినట్లు సమాచారం. దానికి.. సరిగ్గా గుర్తించలేదని గిరిధర్ చెప్పినట్లు తెలిసింది. ఆ తర్వాత అప్పటి ఏవీఎస్‌వో పద్మనాభంను ప్రశ్నించారు. కేసు గురించి ఏమి తెలుసని ఆరా తీశారు.

**చెన్నై నుంచి రవికుమార్ బంధువులు**

నిందితుడు రవికుమార్ సమీప బంధువులనూ దర్యాప్తు అధికారులు విచారించారు. చెన్నైకి చెందిన దంపతులు సోమవారం సిట్ కార్యాలయానికి వచ్చారు. నిందితుడికి చెన్నైలో ఉన్న ఆస్తులు, గిఫ్ట్‌డీడ్‌గా ఇచ్చిన ఆస్తుల రిజిస్ట్రేషన్ గురించి ఆరా తీసినట్లు సమాచారం. రవికుమార్ ఆస్తులు కూడబెట్టే సమయంలో ఏం చెప్పేవారని అడిగినట్లు తెలిసింది.

# సమిష్టిగా కృషిచేసి.. పంచాయతీలను కైవసం చేసుకోవాలి

*** గంగిడి మనోహర్ రెడ్డి**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: బిజెపి నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషిచేసి సర్పంచ్ అభ్యర్థులను గెలిపించుకొని గ్రామపంచాయతీలను కైవసం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డి పిలుపునిచ్చారు. చౌటుప్పల్ మున్సిపల్ పరిధి లింగారెడ్డిగూడెం గ్రామం శుభం గార్డెన్ లో స్థానిక సంస్థల ఎన్నికలపై బిజెపి మండల అధ్యక్షుడు కైరంకొండ అశోక్ అధ్యక్షతన చౌటుప్పల్ మండలం సమావేశం సోమవారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా గంగిడి మనోహర్ రెడ్డి హాజరై మాట్లాడారు. స్థానిక సంస్థలలో బీజేపీ ప్రతి గ్రామం



నుంచి సర్పంచ్, వార్డు సభ్యులు బరిలో ఉంటారన్నారు. మండలంలోని 26గ్రామ పంచాయతీలలో పోటీ చేసి ఎక్కువ గ్రామ పంచాయతీ లను బీజేపీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. రెండు సంవత్సరాల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదని, ఆరు గ్యారంటీలు, 420అబద్ధాలు చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. బిజెపి నాయకులకు ప్రజలు ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో దూడల బిక్షం గౌడ్, శాగ చంద్రశేఖర్ రెడ్డి, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, గుజ్జుల సురేందర్ రెడ్డి, పాలకుర్ల జంగయ్య గౌడ్, ఊడుగు యాదయ్య గౌడ్, బత్తుల జంగయ్య గౌడ్, రమణగోని శంకర్, యాస అశోక్ రెడ్డి కాయితీ రమేష్ గౌడ్, దూర్క కృష్ణ, పొట్టబత్తిని బాలరత్నం, పన్ను శ్రీనివాసరెడ్డి, పులిగిల్ల శ్రీనివాస్ చారి, సిహెచ్ ఎల్లేష్, దిండు భాస్కర్, కొయ్యడ స్వామి, మహేందర్ రెడ్డి, తడక శ్రీనివాస్, అంజయ్య, నరసింహ, మల్లేశం, సంజీవ, రఘురాం, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## దండు మల్కాపురంలో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరా మహిళ శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో భాగంగా చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం గ్రామం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్టీ మునుగోడు నియోజకవర్గం ఎన్నికల ఇంచార్జ్ పబ్బు రాజు గౌడ్ హాజరై మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పబ్బు రాజు గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిల ఆదేశానుసారం మహిళలకు చీరల పంపిణీ చేశామన్నారు. మహిళ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చిట్టంపల్లి శ్రీనివాస్, గ్రామశాఖ అధ్యక్షుడు మునుకుంట్ల రాజు గౌడ్, మార్కెట్ డైరెక్టర్ ఎండీ గౌస్ ఖాన్, గ్రామ పంచాయతీ కార్యదర్శి పాల్వాయి రమాదేవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా సంఘాల లీడర్లు, గ్రామ ప్రజలు తదితురులు పాల్గొన్నారు.

## నూతన డిసిసి అధ్యక్షుడు బీర్ల ఐలయ్యను సన్మానించిన పాశం సంజయ్ బాబు



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: నూతనంగా యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా నియమితులైన ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యను యాదాద్రి భువనగిరి జిల్లాఫిషరీస్ కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ పాశం సంజయ్ బాబు సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ భువనగిరి పట్టణ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు బీసుకుంట్ల సత్యనారాయణ, జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకుడు ఎలమోని శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## గెలుపు ఓటముల సహజం.. నైపుణ్యం ముఖ్యం

**- మండల విద్యాధికారి గురువారావు**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: క్రీడలలో గెలుపు ఓటములు సహజమని.. వాటితో సంబంధం లేకుండా విద్యార్థుల క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించాలని చౌటుప్పల్ మండల విద్యాశాఖ అధికారి గురువరావు అన్నారు. చౌటుప్పల్ మండలం పంతంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 69వ పాఠశాల క్రీడా సమైఖ్య భువనగిరి జిల్లా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు సోమవారం రెండో రోజు కొనసాగాయి. క్రీడాకారులతో కరచాలనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచాలని సూచించారు. క్రీడల్లో రాణించి రాష్ట్రానికి గుర్తింపు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ జి ఎఫ్ కార్యదర్శి కందాడి దశరథ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి నాతి కృష్ణమూర్తి, రంగారెడ్డి జిల్లా ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి తోట జయప్రకాష్, సురేందర్ రెడ్డి, క్రీడా పోటీల నిర్వాహకులు పొన్నగాని కృష్ణమూర్తి, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప మాలదారులకు నిత్య అన్న ప్రసాద వితరణ



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం వలిగొండ రోడ్డు లోని శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయంలో అయ్యప్ప స్వామి నిత్య అన్న ప్రసాద వితరణ 15వ రోజు నిర్వహించారు. శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయం అయ్యప్ప సన్నిధానంలో అయ్యప్ప స్వామి మలాదారులకు చెరుకు అశోక్ గౌడ్ సంతోష దంపతుల కుమారులు చైతన్య గౌడ్, రామ్ చరణ్ గౌడ్, వరద హనుమాన్ దీపిక దంపతుల కూతురు సాయి చంద్రిక, కుమారుడు శశిధర్ లు సోమవారం నిత్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిత్య అన్న ప్రసాద దాతలు మాట్లాడుతూ అయ్యప్ప మాలదారులకు ప్రసాద వితరణ నిర్వహించడం తమ పూర్వ జన్మ సుకృతమని, తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. అన్న ప్రసాద దాతల కుటుంబానికి అయ్యప్ప స్వామి ఆశీస్సులు ఏళ్ల వేళల ఉండాలని, అయురూ ఆరోగ్యాలు, అష్ట ఐశ్వర్యాలు అయ్యప్ప స్వామి ప్రసాదించాలని మనసారా అయ్యప్ప స్వామి మాలదారులు, శివదీక్ష మాలదారులు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో అన్న ప్రసాద వితరణ నిర్వాహకులు తొర్పునూరి నర్సింహ గౌడ్, సన్నిధానం గురుస్వామి చెరుకు అశోక్ గౌడ్, కళ్ళెం నాగరాజు గౌడ్, వరగంటి వెంకటేష్ గౌడ్, మారగోని గణేష్ గౌడ్, స్వాములు పోల్దాస్ రాజు, చెరుకు రాము గౌడ్, దాసరి మురళిస్వామి, చెవగోని గణేష్ గౌడ్, మార్గం శేఖర్ యాదవ్, బందారపు శివగౌడ్, ఉష్కాగుల శ్రీశైలం, అందోజు సన్నిధ్ చారి, బొడిగె భాను గౌడ్, చెరుకు చైతన్య, చందు గౌడ్, తొర్పునూరి సాయి, తొర్పునూరి సాయిలుగౌడ్, శివ ప్రసాద్ గౌడ్, కళ్యాణ్ స్వామి, ఆలయ ప్రధాన అర్చకులు పగిడోజు సంతోష్ కుమార్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి ఒక్కరూ నిత్యం వ్యాయామం చేసినట్లయితే ఆరోగ్యంగా ఉండవచ్చు

*** బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి ) : ప్రతి ఒక్కరూ నిత్యం వ్యాయామం చేసినట్లయితే ఆరోగ్యంగా ఉండవచ్చని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ అన్నారు. సోమవారం మేడ్చల్ నియోజకవర్గం కండ్లకొయ్యలో నూతనంగా ఏర్పాటుచేసిన "ఆర్నాల్డ్ జిమ్ 2" ను బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, మాజీ డిసిసి అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి ఉరుకుల, పరుగుల దైనందిక జీవితంలో మానసిక దృఢత్వంతో పాటు శారీరక దృఢత్వం ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కోఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, మేడ్చల్ జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ యాదవ్, మాజీ సర్పంచ్ నరేందర్ రెడ్డి, మేడ్చల్ మండల్ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు అశోక్ ముదిరాజ్, జగద్గిరిగుట్ట శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, సీనియర్ నాయకులు రాజేందర్, ఎక్స్ కౌన్సిలర్ కృష్ణ గౌడ్, రాజు, సుధాకర్, రాజశేఖర్ గౌడ్, గుబ్బల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు



## సర్పంచు రిజర్వేషన్లలో బీసీలకు అన్యాయం

*** స్టేషన్ ఘనపూర్ ఆర్డీవోకు వినతి పత్రం ఇచ్చిన... బీసీ సంఘం నాయకులు**

జనగామ జిల్లా, ప్రజాస్ఫూర్తి: సర్పంచు రిజర్వేషన్లలో బీసీలకు అన్యాయం జరిగిందని బీసీ సంఘం నాయకులు స్టేషన్ ఘనపూర్ ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2018 లో ఇచ్చిన రిజర్వేషన్ ప్రకారమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. 42% అని మాయమాటలు చెప్పిన ప్రభుత్వం పాత రిజర్వేషన్ ను తగ్గించారన్నారు. బీసీలు జిల్లాలో 18 శాతం కు పరిమితం చేయడం విడ్డూరం గా ఉందని, జిల్లాలో మొత్తం 280 గ్రామ పంచాయతీలకు 100% గ్రామపంచాయతీలు 39 రిజర్వేషన్లు ప్రకారం బీసీలకు వచ్చిన గ్రామపంచాయతీలు 45 గెజిట్ విడుదల చేసిన ప్రభుత్వం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిసి జిల్లా జెఎసి నాయకులు గద్దం రాజు గౌడ్, బిసి జేఏసీ నియోజకవర్గ కన్వీనర్ పీఏసీ మాజీ చైర్మన్ గట్టు రమేష్ గౌడ్ , కో కన్వీనర్ లు అంబాటి కిషన్, రాజ్ పెసరు సారయ్య ముదిరాజ్ , పొన్న శ్రీనివాస్ జేఏసీ, బంగ్లా శ్రీనివాస్, పులి శ్రీనివాస్ గౌడ్ గట్టు శివ గట్టు సురేందర్, తదితరులు పాల్గొన్నారు

## ఈనెల 29,30 తేదీల్లో జోగిపేటలో జరుగనున్న కబడ్డీ పోటీలు

*** ప్రథమ బహుమతి కింద రూ.20వేల నగదు..**



అందోలు, ప్రజాస్ఫూర్తి: జోగిపేట పట్టణంలో ఈనెల 29,30 తేదీలలో మద్దుల అనీల్ స్మారక అందోలు తాలుకా స్థాయి కబడ్డీ క్రీడోత్సవాలు జరుగనున్నాయి. ఈ పోటీలు మాజీ మున్సిపల్ కౌన్సిలర్, ఎ..చిట్టిబాబు ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలకు సంబందించిన వాల్ పోస్టర్‌లు సోమవారం చిట్టిబాబు ప్రారంభించారు. ఈ క్రీడల్లో పాల్గొనే వారు ఎంట్రీ ఫీజును రూ. 500 చెల్లించాలని, క్రీడల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.20వేలు, ద్వితీయ బహుమతి రూ.10వేలు క్యాష్ ప్రైజ్‌తోపాటు ట్రోఫీ ఇవ్వబడుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో అందోలు తాలుకా పరిధిలోని క్రీడాకారులు మాత్రమే పాల్గొనాలని, ప్రతి మ్యాచ్‌కు ప్లెయిర్ ఆఫ్ ది మ్యాచ్ ఇవ్వబడుతుందని, బెస్ట్ ఆల్‌రౌండర్, డిఫెండర్, రైడర్‌లకు ప్రత్యేకంగా ట్రోఫీ అందజేస్తామన్నారు. ఫైనల్ రోజుల క్రీడాకారులకు బోజన వసతి కల్పించబడుతుందన్నారు. యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలన్నారు. పాల్గొనదలచిన వారు 7672037637, 9346492826 నంబర్లకు ఫోన్ చేయాలని నిర్వాహకులు కోరారు.

## ఇందిరమ్మ ఇళ్లతో సొంతింటి కల సాకారం..

*** కాంగ్రెస్ పార్టీ నాయకులు మహిపాల్, ఎం. కృష్ణ**



అందోలు, ప్రజాస్ఫూర్తి :పేదల సొంతింటి కల ఇందిరమ్మ పథకం ద్వారా సాకారమవుతోందని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తెనుగు మహిపాల్, మొరబోయిన కృష్ణ అన్నారు. సోమవారం అందోలు మండల పరిధిలోని కన్ సాన్ పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి జోగిపేట ఏయంసి మాజీ డైరెక్టర్ వెంకట్ రెడ్డి తో కలిసి ముగ్గు వేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పేదల కుటుంబాల్లో ఆనందాన్ని చూస్తున్నామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్ల పాటు డబుల్ ఇండ్ల పేరుతో పేదలను మోసం చేసిందన్నారు. ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నప్పటికి సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను రెండు కళ్లులా భావిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసుకుంటూ వస్తోందన్నారు. ఇందిరమ్మ ఇల్లు రాలేదని ఎవరూ అధైర్య పడొద్దన్నారు. అర్హులైన ప్రతి ఒక్క కుటుంబానికి ఇందిరమ్మ ఇంటిని కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకయ్య, ప్రభు, శంకరయ్య లు పాల్గొన్నారు.

## కెటిఆర్ సేన చేవెళ్ల నియోజక వర్గ ఇన్‌ఛార్జిగా సుదర్శన్

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: కెటిఆర్ సేన చేవెళ్ల నియోజక వర్గ ఇన్‌ఛార్జిగా బ్యాగరీ సుదర్శన్ నియమితులయ్యారు. ఈ మేరకు బ్యాగరీ సుదర్శన్‌ను కెటిఆర్ సేన చేవెళ్ల నియోజక వర్గ ఇన్‌ఛార్జిగా నియమిస్తూ కెటిఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్ ఉత్తర్వులు అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కెటిఆర్ సేనను బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని, అధికార పార్టీ ఇచ్చిన మామీలను నెరవేర్చే వరకు పోరాటం చేస్తామన్నారు. తనను చేవెళ్ల నియోజక వర్గ ఇన్‌ఛార్జిగా నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్‌కు సుదర్శన్ కృతజ్ఞతలు తెలిపారు.



## తోటకూర వజ్రేష్ యాదవ్ కు అభినందనల వెల్లువ



మేడ్చల్, (ప్రజాస్ఫూర్తి) : మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షుడిగా తోటకూర వజ్రేష్ యాదవ్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారి నివాసంలో హజ్ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు అందజేశారు. మేడ్చల్ జిల్లాలో సామాజిక సేవతో పాటు, కాంగ్రెస్ పార్టీ బలోపేతంలో కొత్త అధ్యాయం ఆరంభమైన రోజుగా పలువురు నాయకులు అభిప్రాయపడ్డారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో హజ్ కమిటీ సభ్యులు ముజీబ్, మజార్, మహ్మద్ యాకుబ్, ఖాదర్, యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

## డిసిసి నూతన అధ్యక్షున్ని కలిసిన ఎన్ఎస్‌యుఐ నాయకుడు



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: కాంగ్రెస్ రాజన్న సిరిసిల్ల జిల్లా నూతన అధ్యక్షునిగా ఎన్నికైన సంగీతం శ్రీనివాస్‌ను ముస్తాబాద్ మండలానికి చెందిన ఎన్ఎస్‌యుఐ నాయకుడు దుద్దెడ భాను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సంగీతం శ్రీనివాస్ కాంగ్రెస్ రాజన్న సిరిసిల్ల జిల్లా నూతన అధ్యక్షునిగా ఎన్నికైన సందర్భంగా ఆయనకు పూలబొకే అందజేసి, శాలువా కప్పి సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ రాజన్న సిరిసిల్ల జిల్లా నూతన అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ జిల్లాలో మరింత బలపడనుందని, అంతేగాకుండా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధిస్తారని ఆకాంక్షించారు. కాంగ్రెస్ రాజన్న సిరిసిల్ల జిల్లా నూతన అధ్యక్షుని సంగీతం శ్రీనివాస్‌ను నియమించినందుకు పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు.

## జిపిఎస్ వెంకటాపురం లో మొక్కలు నాటిన ప్రకృతి ప్రేమికుడు బాలు నాయక్



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: పర్యావరణ పరిరక్షణలో భాగంగా నిత్యం మొక్కలు నాటుతూ పలువురు ప్రముఖులకు మొక్కలను బహుమతిగా అందిస్తున్న ప్రకృతి ప్రేమికుడు బాలు నాయక్ సోమవారం నాడు అన్నపురెడ్డిపల్లి మండలం జిపిఎస్ వెంకటాపురం పాఠశాల నందు పాఠశాల విద్యార్థులతో కలిసి కొన్ని మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏదైనా శుభకార్యం కానీ, పుట్టినరోజున, పెళ్లిరోజున ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని కోరారు.అనంతరం ఆకులతో గణితంలోని ఆకారాలు,ఆంగ్లంలోని అక్షరాలు,అంకెలతో బొమ్మలను విద్యార్థులతో చేయించి వాటిని వివరించారు.ఈ మేరకు పాఠశాలకు మొక్కలు వితరణ చేసినందుకు గాను హెచ్ఎం బి.కుమార్ , సాహ ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు చరవాణి ద్వారా కృతజ్ఞతలు తెలిపారు.

## గణనీయంగా పెరుగుతున్న దేవాలయాల ఆదాయం

హైదరాబాద్: రాష్ట్రంలోని దేవాలయాల ఆదాయం గణనీయంగా పెరుగుతోందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. 2023 ఏడాది చివరిలో రాష్ట్రంలోని 699 దేవాలయాల నుంచి రూ.373.55కోట్ల ఆదాయం వచ్చిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన కార్యక్రమాల ద్వారా 2024లో రూ.544.61కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. ఈ మేరకు సోమవారం మంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. "రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాలకు మాస్టర్ ప్లాన్‌ను రూపొందించి వేగంగా అభివృద్ధి పనులు చేపడుతున్నాం. గత ప్రభుత్వం ఒక్క ఆలయాన్ని మాత్రమే అభివృద్ధి చేసింది. మేము వేములవాడ, భద్రాద్రి, కొండగట్టు, ధర్మపురి, బాసర, కీసర, భద్రకాళి, ఐనవోలు, కొమురవెల్లి వంటి ఆలయాలను అభివృద్ధి చేస్తున్నాం. పలు ఆలయాల విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. వీలైనంత వేగంగా పనులను పూర్తి చేస్తాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ పనులు కొనసాగుతాయి" అని మంత్రి పేర్కొన్నారు.

# మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఉచిత పథకాలు

* **ఎమ్మెల్యే కనకయ్య**

ప్రజాస్ఫూర్తి , ఇల్లందు: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఉచిత బస్సు,ఉచిత విద్యుత్ వంటి పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే కనకయ్య అన్నారు. సోమవారం ఇల్లందు స్థానిక ఎంపీడీఓ ధన్ సింగ్ అధ్యక్షతన తాహశిల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిధి గా హాజరై మహిళ సోదరిమణులకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన తో పాటు జిల్లా అభివృద్ధి అధికారి విధ్యాచందన పాల్గొని మహిళలకు చీరలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డి కోటి మంది మహిళలను కోటీశ్వర్లను చేయాలనే సంకల్పంతో ప్రతి పనిలో మహిళలకు పెద్ద పీట వేస్తున్నారన్నారు. పేదలందరికి ఇందిరమ్మ ఇళ్ళు,రేషన్ కార్డులు, 500రూ" గ్యాస్ సిలండర్



ఇస్తున్నామన్నారు. మహిళలందరిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రజా ప్రభుత్వం మహిళ సోదరులకు చీరలు పంపిణి చేస్తున్నామన్నారు. మంచి చేస్తున్న రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ఆశీర్వదించాలన్నారు. తెలంగాణ రాష్ట్రం లో ఉన్న మహిళ స్వయం సహాయక సంఘాలను ప్రోత్సహించాలనే ముఖ్య ఉద్దేశంతో మహిళ సోదరిమణులకు ఇందిరా మహిళ శక్తి పేరిట ఉచిత చీరల పంపిణి చేస్తున్నామన్నారు. అనంతరం జిల్లాను అభివృద్ధి లో ముందుంచి రాష్టపతి చే అవర్డు పొందిన విధ్యా చందన కి శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మెన్ బానోత్ రాంబాబు, ఇల్లందు మండలం మాజీ వైస్ ఎంపిపి మండల రాంమహేష్, స్పెషల్ ఆఫీసర్ కాశయ్య,డీపీఎం, సమ్మక్క,ఏపీఎం రామక్రిష్ణ,మహిళ సంఘం అధ్యక్షురాలు శారద,మాజీ మున్సిపల్ చైర్మెన్ యదలపల్లి అనసూర్య,ఇల్లందు మండలం కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు పులి సైదులు,నాయకులు పూనెం సురేందర్,తాటి భిక్షం,అరెం కిరణ్,ఎట్టి హరిక్రిష్ణ, మడుగు సాంబమూర్తి, చిల్లా శ్రీనివాస్,ప్రసన్న కుమార్ యాదవ్,మాజీ సర్పంచులు కల్తీ పద్మ,పాయం లలిత,పాయం స్వాతి,నాయకురాలు బానోత్ శారద, మోకాళ్ళ వెంకటమ్మ, మార్కెట్ కమిటి డైరెక్టర్ కుంజా వసంతరావు, చంద్రశేఖర్,తారాచంద్ తదితరులు పాల్గోన్నారు.




## మహిళల ఓట్ల కోసం... చీరల పంపిణీతో గాలం

* **బిఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు శీలం స్వామి**

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: రెండేళ్లయిన మహిళలకు బతుకమ్మ పండుగకు చీరలు అందించని కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల ముందు ఇందిరమ్మ పేరుతో మహిళల ఓట్ల కోసం చీరల పంపిణీతో గాలం వేస్తోందని బిఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు శీలం స్వామి విమర్శించారు. ముస్తాబాద్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో అతి పెద్ద పండగయిన బతుకమ్మకు ఆడబిడ్డలకు కానుకగా గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో అప్పటి సిఎం కెసిఆర్ బతుకమ్మ చీరల పంపిణీ చేపట్టారని, అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆ ఆనవాయితీని అటకెక్కించారని అన్నారు. బతుకమ్మ పండగకు ఒక్క చీర ఇవ్వకుండా నేడు ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు చీరల పంపిణీ చేపడుతున్నారన్నారు. ఎన్నికల ముందు ప్రతి మహిళకు రూ.2500 ఇస్తానని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ఇప్పటి వరకు దాన్ని అమలు చేయలేదని, కల్యాణ మస్తు పథకం కింద లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తానని మాట తప్పారని అన్నారు. రూ.500లకే గ్యాస్ సిలిండర్, రూ.4వేల ఆసరా పెన్షన్ ఇవ్వడం లేదని, గత ప్రభుత్వం ఇచ్చిన కెసిఆర్ కిట్‌ను కూడా ప్రస్తుత ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. ఇచ్చిన హామీలను మరిచి, ఇప్పుడు ఓట్ల కోసం చీరలు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్‌కు మహిళలు, ప్రజలే తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఎండి.జహంగీర్, వంగూరి దిలీప్, శేఖర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ వాహనాలను ఎల్లప్పుడూ కండీషన్‌లో ఉంచుకోవాలి

* **ఎస్పీ రోహిత్ రాజు**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లు, ఇతర అధికారుల వాహనాలను జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు ఎస్పీ రోహిత్‌రాజు తనిఖీ చేశారు. పోలీస్ వాహనాల రవాణాధికారి ఆర్ఐ సుధాకర్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన ఈ తనిఖీలో భాగంగా జిల్లాలోని పోలీస్ డ్రైవర్ల సమస్యలు, విధుల్లో భాగంగా వారి పనితీరును గురించి ఎస్పీ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని జిల్లాలోని అన్ని పోలీసు వాహనాలను మంచి కండీషన్‌లో ఉంచుకోవాలని డ్రైవర్లకు ఎస్పీ సూచించారు. పోలీస్ శాఖలో డ్రైవర్లుగా పనిచేసే వారు ఖచ్చితంగా రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండడంలో పోలీసు వాహనాల డ్రైవర్ల పాత్ర చాలా కీలకమని అన్నారు. ప్రతీ డ్రైవర్‌కు తమ వాహన పనితీరు గురించి పూర్తి అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. డ్రైవర్లు తమ విధుల పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహన తనిఖీల సమయాల్లో తగు



జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు. అత్యవసర సమయాల్లో విధులు నిర్వర్తించేటప్పుడు ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. విధుల పరంగా ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పీ సత్యనారాయణ, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఆర్ఐ ఎంటిఓ సుధాకర్, అడ్మిన్ ఆర్ఐ లాల్ బాబు, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వాములకు అన్నదానం

* **అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ప్రారంభం**
* **41 రోజుల పాటు కొనసాగనున్న అన్నదాన ప్రసాద వితరణ..**

అందోలు, ప్రజాస్ఫూర్తి: జోగిపేట పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ప్రసిద్ధిగాంచిన అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద అయ్యప్ప స్వాములుకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. శ్రీ ప్రతి ఏడాది మాదిరిగానే ఈ సారి కూడా అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో దేవాలయం వద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలను చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో అన్నప్రసాదాన్ని అయ్యప్ప మాలను ధరించిన స్వాములకు వడ్డించారు. అన్నప్రసాద వితరణ కార్యక్రమం 41 రోజుల పాటు నిర్వహిస్తామని అలయ కమిటీ సభ్యులు తెలిపారు.



మాల వేసిన అయ్యప్ప స్వాములకు భిక్ష పెట్టాలనుకునే భక్తులు అలయ సేవా సమితి సభ్యులు నిర్ణయించిన రుసుమును చెల్లించినట్లయితే వారి పేర్ల మీద స్వాములకు అన్నప్రసాదాన్ని అందించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకొవాలని వారు సూచించారు.

## మహిళల అభ్యున్నతి, సాధికారతే కాంగ్రెస్ లక్ష్యం...

- **ఏయంసి మాజీ డైరెక్టర్ శేరి వెంకట్ రెడ్డి..**
- **కన్ సాన్ పల్లి లో మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ..**



అందోలు, ప్రజాస్ఫూర్తి: మహిళా అభ్యున్నతికి,వారి సాధికారతకు కాంగ్రెస్ కట్టుబడి ఉందని, ప్రతీ మహిళను కోటీశ్వరాలుని చేయడమే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయం అని ఏయంసి మాజీ డైరెక్టర్ శేరి వెంకట్ రెడ్డి అన్నారు. సోమవారం అందోలు మండలంలోని కన్ సాన్ పల్లి గ్రామంలో ఇందిర మహిళా శక్తి లో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రభుత్వం తరపున అందిస్తున్న చీరలను పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి వారి కుటుంబాల ఆర్థిక స్థిరత్వానికి మహిళా సంఘాలు ఎంతగానో తోడ్పడుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు.అన్ని రంగాలలో మహిళలు మరింతగా అభివృద్ధి పథంలో ముందుకు సాగాలన్నదే ప్రజా ప్రభుత్వం సంకల్పమని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణం,విద్యుత్ ,సన్నబియ్యం,వడ్డీ లేని రుణాలు,నాణ్యమైన చీరలు మహిళలకు ప్రత్యక్ష లాభం చేకూరే అవకాశం ఉందని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తెనుగు మహిపాల్, మొరబోయిన కృష్ణ, కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు చిలుకంటి వీరేశం, మాజీ వార్డు సభ్యులు కలపల్లి ప్రభు, జోగాల అంజయ్య, చెక్రాల వెంకయ్య, రమన్నగారి నర్సింలు, వని ప్రభు,ఐకెపి వివోఏ లు ఆంజనేయులు, కాడేం రేణుక, మహిళా సమాఖ్య గ్రామ అధ్యక్షురాల్లు తలారి వరలక్ష్మి, దండు విజయ, కోశాధికారి కల్వమీది సుజాత తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల భద్రత, చట్టం , న్యాయం పరిరక్షణలో ఎక్సైజ్ శాఖ కీలక పాత్ర

* **మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి**




మల్కాజ్గిరి, (ప్రజాస్ఫూర్తి) : ప్రజల భద్రత, చట్టం , న్యాయం పరిరక్షణలో ఎక్సైజ్ శాఖ కీలక పాత్ర పోషిస్తుందని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మల్కాజ్‌గిరి ఆర్.కే.నగర్, శ్రీ పంచమి హోటల్ సమీపంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఆల్వాల్ ఆబ్కారి (ఎక్సైజ్) పోలీస్ స్టేషన్ ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై కార్పొరేటర్లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్త స్టేషన్ ప్రారంభంతో అక్రమ మద్యం రవాణా, వినియోగంపై మరింత కట్టడి సాధ్యమవుతుందని తెలిపారు. ప్రజలకు సేవ చేయడంలో అధికారులు సమర్థంగా వ్యవహరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ విభాగం అధికారులు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ముకుంద రెడ్డి, అల్వాల్-మల్కాజ్‌గిరి సర్కిల్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, ఎస్.ఐ లు కుమార స్వామి, సంధ్య రాణి, ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ సిబ్బంది , కార్పొరేటర్లు చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి, సబితా అనిల్ కిషోర్ గౌడ్, మేకల సునీత, రాము యాదవ్, మాజీ కార్పొరేటర్లు జగదీష్ గౌడ్, ఆకుల నర్సింగ్ రావు, నాయకులు జేఏసీ వెంకన్న, మేకల రాము యాదవ్, అనిల్ కిషోర్ గౌడ్, డోలి రమేష్, చిన్న యాదవ్, సురేష్, శరణ గిరి, హేమంత్ రెడ్డి, సాయి గౌడ్, సంపత్ యాదవ్, ఉపేందర్ , నర్సింగ్ రావు, శ్రీకాంత్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా రామవరం శిక్షణా శిబిరం ప్రారంభం



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రజల రక్షణ దళంగా యువతను తీర్చిదిద్దేందుకు సిపిఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 'జనసేవాదళ్' వాలంటీర్ శిక్షణా తరగతులు సోమవారం రామవరం సాధన క్రీడా మైదానంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా మాట్లాడారు. జనసేవాదళ్ ఆవిర్భావం సిపిఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి చండ్రా రాజేశ్వరరావు ఆలోచనలోంచి పుట్టిందని ఆయన గుర్తుచేశారు. విజయవాడలో ఒకప్పుడు ఎక్కువైన రౌడీ మూకలను అదుపులోకి తీసుకుని, ముఖ్యంగా మహిళలకు రక్షణ కల్పించేందుకు జనసేవాదళ్ ఏర్పాటయ్యిందని తెలిపారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో విస్తరించి సేవా కార్యక్రమాల్లో ఈ దళం కీలక పాత్ర పోషిస్తున్నట్టు వివరించారు. విపత్తుల సమయంలో, ప్రజలు ఆపదలో ఉన్న సందర్భాల్లో ముందుండి సహాయం చేయగల దళంగా యువతకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ప్రతి గ్రామం, మండలంలో శిక్షణ పొందిన సభ్యులు ప్రజలకు అండగా నిలిచేలా సిద్ధం చేస్తున్నామని తెలిపారు. డిసెంబర్ 26న ఖమ్మంలో జరగనున్న సిపిఐ వందేళ్ల ఉత్సవాల బహిరంగ సభ, భారీ కవాతు విజయవంతం కానున్నదని, దీనికోసం భద్రాద్రి జిల్లాలో నుంచి 3,000మంది వాలంటీర్లను సిద్ధం చేస్తున్నామని సాబీర్ పాషా వెల్లడించారు. శిక్షణలో క్రమశిక్షణ, సేవాభావం, విపత్తుల నిర్వహణ, ప్రజా భద్రత వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఎల్డిఆర్ఎఫ్, మిలిటరీ, ఆర్మీ దళాల శైలిలోనే కఠినమైన శిక్షణ విధానం అమలు చేస్తున్నట్టు చెప్పారు. పార్టీ కార్యక్రమాలు, బహిరంగ సభలు, శాంతిభద్రతల నిర్వహణ కూడా జనసేవాదళ్ బాధ్యతలేనని పేర్కొన్నారు.కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, కందుల భాస్కర్, ఎస్ కె ఫహీమ్, భూక్య శ్రీనివాస్, మునిగడప వెంకటేశ్వర్లు, కె రత్నకుమారి, యాండ్ర మహేష్, మునిగడప పద్మ, మంద నిర్మల తదితరులు పాల్గొన్నారు. జాతీయ శిక్షకుడు మురళి, జిల్లా శిక్షకుడు భూక్య శ్రీనివాస్ శిక్షణ తరగతులు నిర్వహించారు.

## జోగిపేటలో పేదలకు రగ్గుల పంపిణీ



* **లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వితరణ..**
* **లయన్స్ క్లబ్ సేవలపై కృతజ్ఞతలు తెలిపిన పేదలు...**

అందోలు, ప్రజాస్ఫూర్తి: అందోలు -జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని నిరుపేదలకు జోగిపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రగ్గుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టి పేదలకు రగ్గులను పంపిణీ చేశారు. సోమవారం రగ్గులను పంపిణీ చేశారుపట్టణంలోని జోగినాథ స్వామి, పబ్బతి హనుమాన్ దేవాలయాల ముందు ఉన్న యాచకులకు, ఆనాధలకు, నిరుపేదలకు క్లబ్ సభ్యులు రగ్గులను అందజేశారు. ప్రస్తుతం చలికాలం ఉన్నందున చలి నుంచి రక్షించుకునేందుకు రగ్గులను అందజేసినట్లు క్లబ్ అధ్యక్షుడు రవి శేఖర్‌రెడ్డి అన్నారు. రాబోవు రోజుల్లో క్లబ్ తరపున మరిన్ని సేవా కార్యక్రమాలను చేపడతామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా లయన్స్‌క్లబ్ సేవలను విస్తరింపజేస్తామన్నారు. జోగిపేట లయన్స్ క్లబ్ ద్వారా ప్రతి యేటా చేపడుతున్న చేపడుతున్న సేవా కార్యక్రమాలతో ఏదోరకంగా తాము లబ్ధి పొందుతున్నామని అందుకు లైన్స్ క్లబ్ సభ్యులకు రగ్గులను తీసుకున్న పేదలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఏరియా కొ అర్డినేటర్ ఎ.రాంబాబు, కార్యదర్శి జీ.సంతోష్ కుమార్, క్లబ్ మాజీ అధ్యక్షుడు యశ్వంత్‌రెడ్డి, సభ్యులు రాజు, మధుసూధన్‌రెడ్డితో పాటు నాయకుడు గోహెర్ అలీతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## వృత్తి విలువల పరిరక్షణకై నిరంతర కృషి అవసరం

* **TUWJ రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ**
* **పదవి బాధ్యతలు చేపట్టిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కమిటీ**

(ప్రజాస్ఫూర్తి, కుత్బుల్లాపూర్) : పవిత్రమైన జర్నలిజం వృత్తి విలువలను పరిరక్షించేందుకు నిరంతరం కృషి చేయాల్సిన బాధ్యత ప్రతి జర్నలిస్టుపై ఉంటుందని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయుడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షులు కే.విరాహత్ అలీ అన్నారు. సోమవారం నాడు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, షాపూర్ లోని శుభం హోటల్ బాంక్వెట్ హాలులో జరిగిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ కమిటీ బాధ్యతల స్వీకరణ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సమాజ హితం కోసం పురుడుపోసుకున్న మీడియాను, జర్నలిజం పట్ల అవగాహన లేని కొందరు అప్రతిష్టపాలు చేసే చర్యలకు పాల్పడడం సహించరానిదన్నారు. స్వాతంత్ర పోరాటం నుండి మొదలుకొని, మరెన్నో చారిత్రాత్మక ఉద్యమాల్లో మీడియా గొప్ప పాత్రను పోషించిందని, ఎందరో పాత్రికేయులు నీతి, నిజాయితీ, నిర్భీతితో వారి వృత్తి ధర్మాన్ని నిర్వర్తించి సమాజానికి స్ఫూర్తిగా నిలిచారని ఆయన కొనియాడారు.

అసలు సమాజంలో జర్నలిస్టులు ఎవరనే? చర్చ ప్రస్తుతం ప్రజల్లో విస్తృతంగా జరుగుతుందని, దీనికి కారణం నకిలీల బెడదా పెరిగిపోవడమేనని ఆయన తెలిపారు. సమాజం మేలును కాంక్షిస్తూ, విలువలతో కూడిన వృత్తి బాధ్యతలను నిర్వర్తించే వారే నిజమైన జర్నలిస్టులనే విషయాన్ని ప్రజలు గుర్తించాలని విరాహత్ అలీ సూచించారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం డెబ్బై ఏళ్లుగా మడమతిప్పని పోరాటం చేస్తున్న తమ సంఘం, నాటి నుండి నేటివరకు అదే స్ఫూర్తి, నిబద్ధతతో పని చేస్తుందని ఆయన స్పష్టం చేసారు. జర్నలిస్టుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంలో గత ప్రభుత్వ నిర్లక్ష్యం మాదిరిగానే ప్రస్తుత ప్రభుత్వం వ్యవహరిస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన తప్పదని విరాహత్ అలీ అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కోశాధికారి మోతె వెంకట్ రెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గడ్డమీది బాల్ రాజ్, వెంకట్రాం రెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అధ్యక్షులు దయాకర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సాయిబాబా, ప్రధాన కార్యదర్శి మల్లేష్, జిల్లా నాయకులు నాగేంద్ర చారి, వెంకట్, నరేందర్ రాజు, లతో పాటు కుత్బుల్లా పూర్ నియోజకవర్గంలో ప్రధాన ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాల్లో పనిచేస్తున్న వంద మంది జర్నలిస్టులు హాజరయ్యారు.

### ఐడి కార్డుల పంపిణి

కుత్బుల్లా పూర్ నియోజకవర్గంలో పనిచేస్తున్న జర్నలిస్టులకు టీయూడబ్ల్యూజే యూనియన్ గుర్తింపు కార్డులను రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ చేతుల మీదుగా పంపిణీ చేసారు. అనంతరం ప్రెస్ క్లబ్ నూతన కమిటీ బాధ్యులను ఆయన సత్కరించారు.





















Balaraju

# శిశువుపై ఊడి పడ్డ సీలింగ్ ఫ్యాన్.. మానవ హక్కుల కమిషన్ సీరియస్

నారాయణగూడ: ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లోని ఒక గదిలో నవజాత శిశువుపై సీలింగ్ ఫ్యాన్ విరిగిపడిన ఘటనపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (ఎస్‌హెచ్‌ఆర్‌సీ) సీరియస్ అయింది. కొద్దుగూడ గ్రామానికి చెందిన పాయల్ రెండ్రోజుల క్రితం పీహెచ్‌సీ కేంద్రంలో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఆదివారం ఉదయం తల్లి, శిశువు ఉన్న మంచంపై సీలింగ్ ఫ్యాన్ ఒక్కసారిగా తెగిపడింది. ఈ సంఘటనలో శిశువుకు కుడిభాగంలో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆ శిశువును ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించి, చికిత్స అనంతరం డిశ్చార్జ్ చేశారు. ఈ ఘటనపై వివిధ పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా కమిషన్ ఛైర్మన్ జస్టిస్ షమీమ్ అఖ్తర్ సూమోటోగా కేసు నమోదు చేశారు. దీనిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదిలాబాద్ జిల్లా వైద్యాధికారికి నోటీసులు జారీ చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి ఇచ్చిన నివేదికలో ఫ్యాన్ బోల్ట్ తుప్పుపట్టి హుక్ నుంచి వేరుపడటంతో కింద పడిందని ఇచ్చిన వివరణపై కమిషన్ ఛైర్మన్ తీవ్రంగా స్పందించారు. ప్రజా ఆసుపత్రిలో రోగులకు సురక్షిత వాతావరణం కల్పించడం రాజ్యాంగబద్ధమైన బాధ్యత అని పేర్కొన్నారు. శిశువు తల్లిదండ్రులు ఎదుర్కొన్న మానసిక, శారీరక బాధను దృష్టిలో ఉంచుకొని ఈ ఉదంతం గంభీరమైందని వ్యాఖ్యానించారు. తక్షణమే శిశువు తల్లి పాయల్‌కు రూ.50 వేల పరిహారం చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. సంఘటనపై నెలలోపు సమగ్ర నివేదిక సమర్పించాలని, రెండు నెలల్లో పరిహారం చెల్లించాలని ఆదేశాలు జారీ చేశారు.




## నా భర్త ఆచూకీ కనుక్కోండి సార్లూ..!

కరీంనగర్ కలెక్టరేట్: ఉన్న ఊరిలో ఉపాధి కరవై పొట్ట చేత పట్టుకొని దుబాయికి వెళ్లిన భర్త చొక్కాల శ్రీధర్ రెండేళ్లుగా ఫోన్ కలవక, ఆచూకీ దొరక్క భార్య, తల్లి తల్లడిల్లిపోతున్నారు. నా భర్త ఆచూకీ తెలియజేయాలంటూ కనిపించిన ప్రజాప్రతినిధిని, అధికారుల కాళ్ల వేళ్ల పడుతున్నారు. సోమవారం కలెక్టర్‌ను కలిసి తమ గోడు వినిపించేందుకు కరీంనగర్ కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి వచ్చారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గన్నేరువరం మండలం గునుకులకొండాపూర్‌నకు చెందిన శ్రీధర్ భార్య సీహెచ్.అఖిల, తల్లి రమ. అఖిలకు శ్రీధర్‌తో పదేళ్ల కిందట వివాహం జరిగింది. అనంతరం ఇద్దరు ఆడ పిల్లలు జన్మించారు. వారికి మెరుగైన జీవనం కల్పించాలనే ఉద్దేశంతో 2022లో అప్పు చేసి దుబాయికి వెళ్లాడు. అక్కడ చిన్నాచితక పనులు చేస్తుండేవాడు. అయితే 2023 నుంచి అతని ఫోన్ పని చేయటంలేదు. ఆచూకీ లభించడంలేదు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు శ్రీధర్ రాక కోసం కళ్లల్లో



వత్తులేసుకొని ఎదురు చూస్తున్నారు. నా భర్త ఆచూకీ కనుక్కోవాలని రాష్ట్ర, కేంద్ర మంత్రులను కలిసి విజ్ఞప్తి చేశారు. అయినా వారికి నిరాశే ఎదురైంది. సోమవారం కలెక్టర్‌ను కలిసి భర్త ఆచూకీ కనుక్కోవటానికి ఉన్నతాధికారులతో మాట్లాడాలని వారు వేడుకున్నారు.

## వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందని చిన్నారి హత్య..

* **వరంగల్ జిల్లా కోర్టు కీలక తీర్పు**

వరంగల్: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందని మూడేళ్ల కూతురిని అతి కర్కశంగా హతమార్చిన తల్లికి, సహకరించిన మరో వ్యక్తికి జీవిత ఖైదు విధిస్తూ వరంగల్ జిల్లా ప్రధాన న్యాయస్థాన న్యాయమూర్తి వి.బి.నిర్మలాగీతాంబ సోమవారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. హైదరాబాద్ చార్మినార్ ప్రాంతంలో ఆటో నడుపుకుంటూ జీవిస్తున్న సయ్యద్ యూసఫ్(ప్రధాన నిందితుడు)కి భార్య, ఇద్దరు పిల్లలు. వారిని పట్టించుకోకపోవడంతో పిల్లలను తీసుకొని భార్య యూసఫ్‌ను వదిలి పెట్టి వెళ్లింది. అదే



ప్రాంతంలో సయ్యద్ హజీరా బేగం(నిందితురాలు) తన భర్త ఇంతియాజ్ అలీ, మూడేళ్ల కూతురు ఫాతిమా సబాతో నివసిస్తున్నారు. యూసఫ్‌కు, హజీరా బేగం మధ్య పరిచయం పెరిగి వివాహేతర సంబంధం ఏర్పడింది. హైదరాబాద్‌లో ఉండటం క్షేమం కాదని భావించి వీరిద్దరూ చిన్నారి ఫాతిమా సబాతో కలిసి వరంగల్‌లోని రంగశాయిపేటకు వచ్చారు. పాతసామాను వ్యాపారి మహ్మద్ ఖాసిం వద్ద పనికి కుదిరారు. అదే వ్యాపార ప్రాంగణంలో ఒక గదిలో జీవిస్తున్నారు. కొన్నాళ్ల తరువాత వివాహం చేసుకోవాలని హజీరా బేగం యూసుఫ్‌ను కోరింది. చిన్నారిని అడ్డు తొలగిస్తేనే వివాహం చేసుకుంటాననడంతో ఆమె అంగీకరించింది. దీంతో యూసఫ్ 2022 ఏప్రిల్ 23న నిద్రిస్తున్న చిన్నారి రెండు చేతులను గట్టిగా పట్టుకొని గిరాగిరా తిప్పి నేలకు కొట్టాడు. ఆ వెంటనే కన్నతల్లి ఆ చిన్నారి నోరుమూసి గొంతు నులిమేసి హత్య చేసింది. ఈ విషయంపై పాత సామాన్ల వ్యాపారి ఖాసిం ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిల్స్‌కాలనీ పోలీసులు హత్యా నేరం కింద కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ ముస్క శ్రీనివాస్ దర్యాప్తు జరిపి న్యాయస్థానంలో నేరారోపణ పత్రం దాఖలు చేశారు. తాజాగా కేసు విచారణలో నేరం రుజువు కావటంతో న్యాయస్థానం నిందితులిద్దరికీ యావజ్జీవ కారాగార శిక్ష విధించింది.



## సుక్మా జిల్లాలో 15 మంది మావోయిస్టుల లొంగుబాటు

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ ఎదుట 15 మంది కీలక మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో ఐదుగురు మహిళలు, 10 మంది పురుషులు ఉన్నారు. లొంగిపోయిన వారిలో పీఎల్‌జీఏ (పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ) నంబర్ వన్ బెటాలియన్‌లో చురుగ్గా పని చేస్తున్న నలుగురు ఉన్నట్లు ఎస్పీ వెల్లడించారు. లొంగిపోయిన మావోయిస్టులపై రూ.40 లక్షల రివార్డు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. అజ్ఞాతంలో ఉన్న మిగతా మావోయిస్టులు కూడా హింసా మార్గాన్ని వీడి లొంగిపోవాలని పిలుపునిచ్చారు.

## సిద్ధిపేటలో రోడ్డు ప్రమాదం.. నవ వధువు మృతి..

* **భర్తకు తీవ్ర గాయాలు**

మిరుదొడ్డి: వైవాహిక జీవితంలోకి అడుగు పెట్టామన్న ఆనందం ఆ నూతన దంపతులకు ఎంతో కాలం నిలవలేదు. కోటి ఆశలతో నూతన బంధంలోకి అడుగుపెట్టిన కొన్నాళ్లకే రోడ్డు ప్రమాదం వారిద్దరినీ వేరు చేసింది. సిద్ధిపేట జిల్లా మిరుదొడ్డి మండలం పెద్ద చెప్యాల శివారులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నవ వధువు ప్రాణాలు కోల్పోగా.. భర్త ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దుబ్బాక సీఐ శ్రీనివాస్, ఎస్సై సమత వెల్లడించిన వివరాల ప్రకారం.. ప్రణతి (24), సాయికుమార్‌లకు



ఇటీవల వివాహమైంది. ఉద్యోగ నిమిత్తం వారిద్దరూ సిద్ధిపేట నుంచి ద్విచక్రవాహనంపై హైదరాబాద్ వెళ్తుండగా.. పెద్ద చెప్యాల శివారులో అదుపు తప్పిన ట్రాక్టర్ వేగంగా వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. 108 వాహనంలో వారిని గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించే క్రమంలో ప్రణతి మృతి చెందింది. సాయికుమార్‌కు తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. కొత్త జీవితంవైపు అడుగులు వేస్తున్న నూతన దంపతుల ప్రయాణం కన్నీటి కథగా మారిపోవడంతో పెద్ద చెప్యాల గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి

## పంచాయతీ ఎన్నికలకు సిద్ధం.. ఎన్నికల సంఘానికి ప్రభుత్వం లేఖ




హైదరాబాద్: పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్ల ప్రక్రియను ప్రభుత్వం పూర్తి చేసింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘానికి వివరాలు సమర్పించి, ఎన్నికలకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపింది. అన్ని జిల్లాల కలెక్టర్లు సమర్పించిన సర్పంచ్, వార్డు సభ్యుల గెజిట్‌లను ప్రభుత్వం ఎస్ఈసీకి పంపింది. పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలకు నిర్వహించాలని నిర్ణయించిన ప్రభుత్వం.. గత రెండు రోజులుగా దీనికి సంబంధించి తీవ్ర కసరత్తు చేసింది. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన అన్ని రిజర్వేషన్లతోపాటు, లాటరీ విధానంలో మహిళా రిజర్వేషన్లను కూడా పూర్తి చేసింది. పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన పిటిషన్‌పై ఇవాళ హైకోర్టులో విచారణ జరగాల్సింది. అయితే, ప్రధాన న్యాయమూర్తి సెలవులో ఉన్నందువల్ల విచారణ జరగలేదు. మంగళవారం విచారణ తర్వాత నోటిఫికేషన్ జారీ చేసేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా సిద్ధంగా ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా 12,733 పంచాయతీల్లోని 1,12,288 వార్డుల్లో మూడు విడతలుగా ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది.

## ముగిసిన ఐబొమ్మ రవి పోలీస్ కస్టడీ.. చంచల్‌గూడ జైలుకు తరలింపు

హైదరాబాద్: సినిమాల పైరసీ కేసులో నిందితుడు, ఐబొమ్మ వెబ్‌సైట్ నిర్వాహకుడు రవి ఐదు రోజుల పోలీస్ కస్టడీ ముగిసింది. దీంతో సైబర్ క్రైమ్ పోలీసులు అతడికి వైద్య పరీక్షలు చేయించి.. నాంపల్లి కోర్టులో హాజరు పర్చారు. అనంతరం చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఐదు రోజుల కస్టడీలో రవి కీలకమైన విషయాలను వెల్లడించినట్లు సమాచారం. రవిపై ఐదు వేర్వేరు కేసులు నమోదు చేశారని ఆయన తరపు న్యాయవాది శ్రీనాథ్ వెల్లడించారు. ఈ కేసుల్లో ఒక్కదానిలో మాత్రమే కోర్టు రిమాండ్ విధించి, విచారణ నిమిత్తం ఐదు రోజుల కస్టడీకి అప్పగించిందని ఆయన వెల్లడించారు. అయితే, కస్టడీలో రవి పోలీసులకు సహకరించలేదనే ప్రచారంలో ఎటువంటి వాస్తవం లేదని స్పష్టం చేశారు. రవి తరపు



న్యాయవాదులు ఇప్పటికే కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై మంగళవారం విచారణ జరగనుంది.

## పటాన్‌చెరు ఎమ్మెల్యే సోదరుడి ఆస్తులు అటాచ్ చేసిన ఈడీ

హైదరాబాద్: పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సోదరుడి ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అటాచ్ చేసింది. మధుసూదన్‌రెడ్డికి చెందిన రూ.80కోట్లు అటాచ్ చేసినట్లు సమాచారం. మధుసూదన్‌రెడ్డికి చెందిన సంతోష్ శాండ్ అండ్ గ్రానైట్ కంపెనీ రూ.300 కోట్ల అక్రమాలు చేసిందని, అంతేకాకుండా ప్రభుత్వానికి మధుసూదన్‌రెడ్డి రూ.39 కోట్ల రాయల్టీ




చెల్లించలేదని ఆరోపణలు వచ్చాయి. దీంతో ఈడీ విచారణ చేపట్టింది. ఈ క్రమంలోనే ఆస్తుల్ని అటాచ్ చేసింది.

## కోకాపేట.. ఎకరం ధర రూ.137 కోట్లు



హైదరాబాద్: నగర శివారులోని కోకాపేటలో భూములు రికార్డు ధర పలికాయి. ఎకరం ధర అత్యధికంగా రూ.137.25 కోట్లు పలికింది. కోకాపేటలోని నియోపోలిస్ ప్రాంతంలోని సర్వే నంబర్ 17, 18లోని భూములకు వేలం నిర్వహించగా.. సర్వే నంబర్ 17లోని భూమి ఎకరం 137.25 కోట్లు పలికింది. హెచ్ఎండీఏ పరిధిలోని ఖరీదైన భూములను ఆన్‌లైన్‌లో వేలం వేయడానికి ప్రభుత్వం నిర్ణయించి నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. ఇటీవల రాయదుర్గంలో 7.67 ఎకరాలకు తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ(టీజీఐఐసీ) నిర్వహించిన వేలంపాటలో రూ.1,357 కోట్లకు ఓ సంస్థ దక్కించుకుంది. ఇక్కడ కనీస ధర ఎకరాకు రూ.101 కోట్లుగా నిర్ణయించగా.. వేలంలో రూ.177 కోట్లు పలికింది. ఈ నేపథ్యంలో తాజాగా కోకాపేట నియోపోలీస్‌లోని సర్వే నంబర్ 17, 18లోని భూములను హెచ్ఎండీఏ వేలం వేసింది. ఎకరా కనీస ధర రూ.99 కోట్లుగా నిర్ణయించగా.. అత్యధికంగా రూ.137.25 కోట్లు పలికింది.

## హైదరాబాద్‌లో భూముల అమ్మకంపై ప్రభుత్వాన్ని నిలదీయండి: కార్పొరేటర్లతో కేటీఆర్

హైదరాబాద్: పార్టీ వెంటే ఉన్న ప్రతి కార్పొరేటర్‌కు భవిష్యత్తులో మరిన్ని పదవులు వస్తాయని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో జీహెచ్ఎంసీ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లతో ఆయన సమావేశమయ్యారు. బల్దియా సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లకు కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. పదేళ్ల పాటు ఎలాంటి అవినీతికి తావు లేకుండా పనిచేశారని.. కరోనా వంటి తీవ్ర సంక్షోభంలోనూ అద్భుతంగా సేవలందించారని కొనియాడారు. ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత కార్పొరేటర్లు ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలపై పోరాటం చేశారన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పోరాడిన తీరుకు కేటీఆర్ అభినందనలు తెలిపారు. పరిశ్రమలకు కేటాయించిన వాటితో పాటు హైదరాబాద్‌లో భూముల అమ్మకంపై బల్దియా సమావేశంలో నిలదీయాలని ఆయన సూచించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ప్రభుత్వ వైఫల్యంపై నిలదీయాలన్నారు.

# నూతన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్.. తొలిరోజు 17 కేసుల విచారణ

సుప్రీం కోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ నేడు ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే సీజేఐ హోదాలో తొలి రోజు ఆయన 17 కేసులు విచారించారు. అదే విధంగా ఓ కొత్త విధానపరమైన నియమాన్ని తీసుకొచ్చారు. ఇకపై అర్జెంట్ లిస్టింగ్ కేసులను తప్పనిసరిగా లిఖితపూర్వకంగా సమర్పించాల్సి ఉంటుందన్నారు. మరణశిక్ష, వ్యక్తిగత స్వేచ్ఛకు విఘాతం వంటి అసాధారణ పరిస్థితుల్లోనే మౌఖిక అభ్యర్థనలను అనుమతించనున్నట్లు చెప్పారు. రాష్ట్రపతి భవన్‌లో సీజేఐగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం జస్టిస్ సూర్యకాంత్ సుప్రీం కోర్టుకు చేరుకున్నారు. న్యాయస్థానం ప్రాంగణంలోని గాంధీ, బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు. అనంతరం ఒకటో నంబర్ కోర్టు రూమ్‌లో జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ అతుల్ ఎస్.



చందూర్కర్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనానికి నేతృత్వం వహించారు. ఓ ప్రైవేటు సంస్థకు వ్యతిరేకంగా హిమాచల్ ప్రదేశ్ దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పును వెలువరించారు. ఆయన నేతృత్వంలోని ధర్మాసనం రెండు గంటల్లో దాదాపు 17 కేసులను విచారించింది. సుప్రీం కోర్టు అడ్వకేట్స్ ఆన్ రికార్డ్ అసోసియేషన్ అధ్యక్షుడు విపిన్ నాయర్ కొత్త సీజేఐని కోర్టురూంలోకి స్వాగతించారు. ఓ న్యాయవాది ఆయన్ను 'రైతు కుమారుడు సీజేఐ అయ్యారు' అని పలకరించారు. ఇదిలా ఉండగా.. ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బి.ఆర్.గవాయ్ పదవీకాలం ఆదివారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో జస్టిస్ సూర్యకాంత్ నేడు బాధ్యతలు స్వీకరించారు. దీంతో సీజేఐగా బాధ్యతలు చేపట్టిన తొలి హరియాణా వాసిగా రికార్డు సృష్టించారు. 2027 ఫిబ్రవరి 9 వరకు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు.

## 'తిలక్ అరెస్టు నుంచి కసబ్ విచారణ వరకు'.. కనుమరుగు కానున్న ఆ చారిత్రక కట్టడం

స్వాతంత్య్ర పోరాట యోధుడు బాలగంగాధర తిలక్ అరెస్టు నుంచి.. ముంబయి దాడుల ఉగ్రవాది అజ్మల్ కసబ్ విచారణ వరకు ఎన్నో చారిత్రక ఘట్టాలకు వేదికగా నిలిచిన ముంబయి క్రైమ్ బ్రాంచ్ పాత భవనం త్వరలో కనుమరుగు కానుంది. ముంబయి పోలీస్ కమిషనర్ ప్రధాన కార్యాలయ ప్రాంగణంలోని ఈ 117 ఏళ్ల కట్టడాన్ని త్వరలో కూల్చివేయనున్నారు. రెండంతస్తుల ఈ భవనం ఇక ఏ మాత్రం సురక్షితం కాదని, మరమ్మతులు చేయలేని దుస్థితికి చేరుకున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. కూల్చివేసిన అనంతరం ఈ స్థలంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఆరంతస్తుల భవనం నిర్మిస్తామని




అధికారులు వెల్లడించారు. పాత నిర్మాణాన్ని 1908లో 'మలాడ్ స్టోన్స్' ఉపయోగించి నిర్మించారు. 1909 జూన్ 9న ఇంపీరియల్ పోలీస్ ఆఫీసర్ ఎఫ్.ఏ.ఎం.హెచ్.విన్సెంట్ ఆధ్వర్యంలో ఇందులో సీఐడీ కార్యాలయం ప్రారంభమైంది. ఆయనే నగర మొదటి డీసీపీ (సీఐడీ)గా ఉన్నారు. బ్రిటిష్ హయాంలో ముంబయి పోలీస్‌కు చెందిన రాజకీయ నిఘా, ఫారిన్ బ్రాంచ్, క్రైమ్ బ్రాంచ్ విభాగాలు ఈ భవనం నుంచే పనిచేసేవి. తీవ్రమైన నేరాల దర్యాప్తు కోసం 1920లో డీసీపీ (క్రైమ్) పదవిని సృష్టించారు. ఆయా కేసుల్లో అండర్‌వరల్డ్ డాన్‌లు ఛోటా రాజన్, అరుణ్ గావ్లీ, అబూ సలేం, బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ వంటివారిని ఇక్కడే విచారించారు. 1925లో సంచలనం సృష్టించిన బావ్లా హత్య కేసునూ ఇక్కడే దర్యాప్తు చేశారు. క్రైమ్ బ్రాంచ్‌లో పనిచేసిన ప్రతి ఒక్కరికి ఈ భవనంతో భావోద్వేగ సంబంధం ఉందని పోలీసు చరిత్రకారుడు దీపక్ రావు 'పీటీఐ' వార్తాసంస్థకు తెలిపారు. ఈ భవనం కాలగర్భంలో కలిసిపోయే ముందు అధికారులు ఆఖరుసారి దీన్ని సందర్శించే యోచనలో ఉన్నట్లు వెల్లడించారు.

## 'ఎస్ఐఆర్' ఎఫెక్ట్..! బెంగాల్ నుంచి బంగ్లాదేశీయుల ఇంటిబాట

'హకీంపుర్'.. పశ్చిమ బెంగాల్‌లో భారత్ బంగ్లాదేశ్ సరిహద్దులోని ఈ ప్రాంతంలో చరిత్ర పునరావృతమవుతున్నట్లు కనిపిస్తోంది. కానీ, రివర్స్ డైరెక్షన్‌లో. 1947లో దేశ విభజన, 1971లో బంగ్లాదేశ్ విమోచన యుద్ధం సమయంలో ఆ దేశం నుంచి వేలాది మంది శరణార్థులు సరిహద్దు దాటి ఇక్కడికి చేరుకున్నారు. ప్రస్తుతం అనేక మంది స్వదేశం బాట పడుతున్నారు. పశ్చిమ బెంగాల్‌లో నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా 'ప్రత్యేక సమగ్ర సవరణ' దీనికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. 'ఎస్ఐఆర్' ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి పత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అనేక ఏళ్ల క్రితం హకీంపుర్‌లో స్థిరపడిన, సరైన పత్రాలు



లేని బంగ్లాదేశ్ జాతీయులు నవంబరు ప్రారంభం నుంచి స్వచ్ఛందంగా స్వదేశానికి వెళ్తున్నట్లు తెలుస్తోంది. నకిలీ ఆధార్, ఓటరు కార్డులు, అసలు పత్రాలే లేకుండా నివసిస్తున్నవారు.. ఇక తప్పించుకోలేమన్న భావనతో ఎన్నికల సిబ్బంది ఇళ్లకు వచ్చేలోపే తిరిగి వెళ్లిపోవాలని చూస్తున్నట్లు సమాచారం. ఒకప్పుడు తమ ఇంటి పెద్దలు వచ్చిన హకీంపుర్ బార్డర్ అవుట్‌పోస్ట్ దారిలోనే తిరుగు ప్రయాణమవుతున్నారు. ఇక్కడి అక్రమ చొరబాటుదారులు చాలావరకు బంగ్లాదేశ్‌లోని ఖుల్నా, సత్ఖిరా, జశోర్, బగెర్హట్ తదితర ప్రాంతాలకు చెందిన దినసరి కూలీలే. పనుల కోసం చట్టవిరుద్ధంగా భారత్‌లోకి ప్రవేశించామని, తమవద్ద పత్రాలు లేవని చాలామంది బహిరంగంగా అంగీకరిస్తున్నట్లు సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ పీటీఐ వార్తాసంస్థ పేర్కొంది. 1971 సమయంలో శరణార్థులకు ఆశ్రయం కల్పించిన ఇక్కడి గ్రామస్థులు.. ప్రస్తుత పరిణామాలను అసాధారణమైనవిగా పేర్కొన్నారు. అప్పట్లో మాదిరిగానే.. ఇప్పుడు కూడా వీరికి ఆహారం, చాయ్ వంటివి అందిస్తున్నారు. బంగ్లాదేశ్‌కు స్వచ్ఛందంగా తిరిగి వెళ్లిపోతున్నవారి సంఖ్య నవంబరు రెండో వారం నుంచి ఒక్కసారిగా పెరిగినట్లు బీఎస్ఎఫ్ అధికారులు వెల్లడించారు. ఈ పరిస్థితులను వారు 'ఎస్ఐఆర్'తో ముడి పెడుతున్నట్లు తెలిపారు. అయితే, ఇప్పటివరకు ఎంతమంది తిరిగి వెళ్లారనే వివరాలపై స్పష్టత లేదు. మరోవైపు ఈ పరిణామాల గురించి తెలుసుకున్న బెంగాల్ గవర్నర్ సి.వి. ఆనంద్ బోస్.. హకీంపుర్ బీఎస్ఎఫ్ బార్డర్ అవుట్ పోస్ట్ వద్ద పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలిస్తానని తెలిపారు.




## 'ప్రత్యేక పరిస్థితుల్లో జరిగిన దుర్ఘటన'.. తేజస్ ప్రమాదంపై హిందుస్థాన్ ఏరోనాటిక్స్

బెంగళూరు: హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ తయారు చేసిన తేజస్ యుద్ధ విమానం దుబాయ్ ఎయిర్ షోలో శుక్రవారం కూలిపోయిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో పైలట్ వింగ్ కమాండర్ నమాంశ్ స్యాల్ మృతిచెందారు. ఆయన మరణం పట్ల కంపెనీ తీవ్ర విచారం వ్యక్తం చేసింది. మరోవైపు ఈ ఘటనతో సోమవారం నాటి ట్రేడింగ్‌లో హెచ్ఏఎల్ షేర్లు భారీగా పడిపోయాయి. దీంతో ప్రమాదాన్ని ప్రత్యేక పరిస్థితుల్లో సంభవించిన దుర్ఘటనగా కంపెనీ అభివర్ణించింది. కంపెనీ షేర్లు సోమవారం ఉదయం ఎనిమిది శాతానికి పైగా పడిపోయాయి. దుబాయ్ ఎయిర్ షోలో జరిగిన ఈ సంఘటనను 'అసాధారణ పరిస్థితుల వల్ల తలెత్తిన ప్రత్యేక దుర్ఘటన'గా హెచ్ఏఎల్ పేర్కొంది. ఈ ప్రమాదం తమ సంస్థ వ్యాపార కార్యకలాపాలు, ఆర్థిక పనితీరు లేదా భవిష్యత్తు డెలివరీలపై ఎలాంటి ప్రభావం చూపదని హామీ ఇచ్చింది. అయినప్పటికీ.. బీఎస్ఈలో షేరు ఓ దశలో దాదాపు 8 శాతం తగ్గి రూ. 4,205 వద్ద ట్రేడైంది. ప్రమాదంపై విచారణ జరుపుతున్న ఏజెన్సీలకు తమ పూర్తి సహకారం ఉంటుందని హెచ్ఏఎల్ తెలిపింది. అన్ని రకాలుగా సహకరిస్తామని హామీ ఇచ్చింది. ఈ విషయంలో వాటాదారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందజేస్తామని పేర్కొంది. ఈ తేజస్ యుద్ధ విమానం తమిళనాడులోని సూలూరు స్క్వాడ్రన్‌కు చెందినది. సుమారు ఎనిమిది నిమిషాలు విన్యాసాలు చేసిన తర్వాత ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ప్రమాదానికి గల కారణాలను తెలుసుకోవడానికి ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ విచారణకు ఆదేశించింది.

## కార్యకర్త కుటుంబానికి అండగా జనసేనాని.. రూ. ఐదు లక్షల చెక్కు అందజేత

ఉరవకొండ నియోజకవర్గం వజ్రకరూరు మండలం వెంకటాంపల్లి గ్రామానికి చెందిన జనసేన పార్టీ క్రియాశీలక సభ్యుడు రూపనాయక్ గత కొంత కాలం కింధట విద్యుత్తు ప్రమాదంలో మరణించడం జరిగింది. జనసేన పార్టీ అధ్యక్షులు డిప్యూటీ సీఎం "కొణిదెల, పవన్ కళ్యాణ్" వారి కుటుంబానికి అండగా ఉంటామని తెలియజేస్తు ఈ సోమవారం జనసేన పార్టీ మంగళగిరి ఆఫీస్ లో ఎంఎల్సి,'కొణిదెల నాగబాబు' అనే చేతుల మీదుగా జనసేన పార్టీ జనరల్ సెక్రటరీలు శ్రీరామ్ తళ్లూరి టి శివశంకర్ , ఉరవకొండ నియోజకవర్గం ఇంచార్జి 'గౌతం కుమార్ గారితో' కలిసి "5 లక్షల" రూపాయల చెక్కును వారి కుటుంబసభ్యులకు ఇవ్వటం జరిగింది. ఇంచార్జి 'గౌతం కుమార్' మాట్లాడుతూ "క్రియాశీలక సభ్యులు ప్రమాదశత్తు మరణిస్తే 5లక్షలు ప్రమాద బీమా, 50000 వరకు తక్షణ సహాయం". జనసేన పార్టీ తరపున అందచేస్తారని అధే విధంగా రాష్ట్ర వ్యాప్తంగ 220 మంది చనిపోయిన క్రియాశీలక సభ్యుల ఒక్కో కుటుంబానికి



5 లక్షలు చెప్పున 11 కోట్ల రూపాయల చెక్కలను ఈ రోజున ఇవ్వటం జరిగింది. ఉరవకొండ నియోజకవర్గంలో క్రియాశీలక సబ్యుల కుటుంబం రూపనాయక్ వారి తల్లి కమలమ్మ గారు మాట్లాడుతూ చెక్ అందించిన గొప్ప మనిషి మానవతావాధి ప్రజల మనిషి ప్రతి క్రియాశీలక కుటుంబం "పవన్ కళ్యాణ్" కి రుణపడి ఉంటామని తెలియజేసారు.

## దిల్లీలో 'ఆపరేషన్ క్రిస్టల్ ఫోర్ట్రెస్'.. రూ.262 కోట్లు విలువైన డ్రగ్స్ స్వాధీనం

నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అధికారులు, దిల్లీ పోలీసులు చేపట్టిన సంయుక్త ఆపరేషన్‌లో దిల్లీలో భారీ మొత్తంలో డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. 'ఆపరేషన్ క్రిస్టల్ ఫోర్ట్రెస్' పేరుతో చేపట్టిన తనిఖీల్లో న్యూదిల్లీ ఛత్రపుర్‌లోని ఓ ఇంట్లో రూ.262 కోట్ల విలువైన 329 కిలోల మెథాంఫెటమైన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌సీబీ అధికారులు వెల్లడించారు. డ్రగ్స్ అక్రమ రవాణాకు సంబంధించి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశామన్నారు. దిల్లీ సరిహద్దుల్లో విస్తరిస్తున్న అధునాతన మాదకద్రవ్యాల సిండికేట్‌ను నిర్మూలించడానికి తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఆపరేషన్ క్రిస్టల్ ఫోర్ట్రెస్ చేపట్టినట్లు



అధికారులు తెలిపారు. నెలలతరబడి నిఘా పెట్టి డ్రగ్స్ రాకెట్ గుట్టు రట్టు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ అక్రమ రవాణా ముఠాకు విదేశీ ఆధారిత కింగ్‌పిన్‌తో సంబంధాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. విదేశీ హ్యాండ్లర్ల సూచనలతో నిందితులు డ్రగ్స్‌ను అక్రమ రవాణా చేస్తున్నారని.. వారితో సంప్రదింపుల కోసం ఎన్‌క్రిప్టెడ్ కమ్యూనికేషన్ యాప్‌లను ఉపయోగిస్తున్నారన్నారు. నాగాలాండ్‌కు చెందిన ఓ మహిళ డ్రగ్స్ రవాణాలో వీరికి సహకరిస్తున్నట్లు గుర్తించామన్నారు. డ్రగ్స్ రాకెట్ గుట్టు రట్టు చేసినందుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఎన్సీబీ అధికారులను, దిల్లీ పోలీసులను అభినందించారు. భారత్‌ను డ్రగ్స్‌రహిత దేశంగా మార్చాలని మోదీ ఇచ్చిన పిలుపుమేరకు అధికారులు వేగవంతమైన చర్యలు తీసుకుంటున్నారన్నారు.

## కర్ణాటకలో సీఎం మారనున్నారా..? సిద్ధూ సరికొత్త వ్యాఖ్యలు

కర్ణాటకలో సీఎం మార్పుపై ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ తరుణంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కొత్త చర్చకు తెరతీసేలా వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయిస్తే.. ఐదేళ్లు సీఎంగా కొనసాగుతానని అన్నారు. సీఎం మార్పుపై తుది నిర్ణయం పార్టీ కేంద్ర నాయకత్వంపై ఆధారపడి ఉందని వెల్లడించారు. దానిని తాను, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అంగీకరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఐదేళ్లు తానే ముఖ్యమంత్రిగా



ఉంటానని గతంలో వ్యాఖ్యానించిన సిద్ధరామయ్య.. ఇప్పుడు అందుకు భిన్నమైన స్వరం వినిపించడం గమనార్హం. 2023లో జరిగిన కర్ణాటక విధానసభ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కాంగ్రెస్ గద్దెనెక్కిన నాటి నుంచీ రెండున్నరేళ్ల తర్వాత అధికార పంపిణీ ఉంటుందని ప్రచారంలో ఉంది. నవంబర్ 20తో ఆ రెండున్నరేళ్ల గడువు ముగిసింది. దాంతో కర్ణాటక రాజకీయాలు వేడెక్కాయి. అందుకు తగ్గట్టే సిద్ధూ, డీకేతో పాటు వారి శిబిరాలకు చెందిన నేతలంతా దిల్లీకి రాకపోకలు సాగించడంతో ఆ ప్రచారం తీవ్రమైంది. ఇదిలా ఉంటే.. మొన్నటి వరకు ముఖ్యమంత్రి పీఠం కోసం సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌లకే పరిమితమైన రాజకీయం..ఇప్పుడు మరో దారి పట్టింది.

## 10 వేల ఏళ్లలో తొలిసారి పేలిన అగ్నిపర్వతం.. విమానయాన సంస్థలు అలర్ట్!





ఆఫ్రికా దేశమైన ఇథియోపియాలో ఓ అగ్నిపర్వతం 10 వేల సంవత్సరాల్లో తొలిసారిగా పేలింది. భారీ విస్ఫోటం కారణంగా పెద్దఎత్తున బూడిదతోపాటు పొగలు వెలువడుతున్నాయి. ఇవి నింగిలో వేల మీటర్ల ఎత్తుకు చేరుకోవడంతో.. విమాన రాకపోకలపై ప్రభావం పడుతున్నట్లు తెలుస్తోంది. సోమవారం కేరళలోని కన్నూర్ నుంచి అబుధాబీకి బయల్దేరిన విమానాన్ని మార్గంమధ్యలో అహ్మదాబాద్‌కు దారిమళ్లించారు. హేలీ గుబ్బి అగ్నిపర్వతం నుంచి వెలువడుతున్న బూడిద, పొగ ఉత్తర భారతానికీ విస్తరించే అవకాశం ఉందనే అంచనాలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతం మీదుగా వెళ్లాల్సిన విమాన సర్వీసులపై ప్రభావం పడుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. పౌర విమానయానశాఖ అధికారులు, విమానయాన సంస్థలు ఇప్పటికే ఈ వ్యవహారంపై దృష్టి సారించినట్లు సమాచారం. పేలుడు కారణంగా విమాన కార్యకలాపాలపై ప్రభావాన్ని నిశితంగా పరిశీలిస్తున్నామని, తదనుగుణంగా చర్యలు తీసుకుంటామని, ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని 'ఆకాశ ఎయిర్' ఓ ప్రకటనలో తెలిపింది. హేలీ గుబ్బి అగ్నిపర్వతం ఇథియోపియాలోని అఫర్ రీజియన్‌లో ఉంది. గత 10 వేల సంవత్సరాల్లో ఇది పేలినట్లు రికార్డులు లేవు. తాజా విస్ఫోటాన్ని స్థానిక చరిత్రలో అత్యంత అసాధారణమైన ఘటనల్లో ఒకటిగా శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. మారుమూల ప్రాంతం కావడంతో ప్రాణ, ఆస్తి నష్టం వివరాలు తెలియరాలేదు. దీన్నుంచి పెద్దఎత్తున వెలువడిన బూడిద, పొగ ఇప్పటికే ఎర్ర సముద్రం మీదుగా ఒమన్, యెమెన్ దేశాలకు విస్తరించాయి.

MOVIE TIME

## విడుదలకు ముందే
# పెద్ది రికార్డులు
### చికిరి చికిరి పాటకు వందమిలియన్ వ్యూస్



**టాకీస్:** విడుదలకు ముందే రికార్డులను తన ఖాతాలో వేసుకుంటోంది 'పెద్ది'. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రం ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. దానికి కారణం ఇటీవల విడుదలైన 'చికిరి చికిరి' పాటనే. ఈ పాట రికార్డు స్థాయిలో వ్యూస్‌ను సొంతం చేసుకుంటోంది. 16 రోజుల్లో అన్ని భాషల్లో కలిపి 100 మిలియన్ల వ్యూస్‌ను (10 కోట్ల వ్యూస్) సొంతం చేసుకున్నట్లు టీమ్ తాజాగా తెలిపింది. దీంతో రామ్‌చరణ్ అభిమానులు సంబరపడుతున్నారు. మరోవైపు ఈ పాటలోని హుక్‌స్టెప్ కూడా బాగా వైరలవుతోంది. దీన్ని ఏకంగా సోషల్ మీడియాలో 5 లక్షల మందికి పైగా రీక్రియేట్ చేసినట్లు నిర్మాణ సంస్థ తెలిపింది. ఇన్‌స్టా, యూట్యూబ్‌లో కలిపి ఇంతమంది దీన్ని రీల్స్ చేసినట్లు వెల్లడించింది. అలాగే హీరో నితిన్ కుమారుడు కూడా ఈ పాటకు చేతులు కదుపుతూ ఎంజాయ్ చేయడం అందరినీ ఆకట్టుకుంటోంది. చికిరి చికిరి... అంటూ సాగే ఈ సాంగ్‌ను ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ స్వరపరచగా, మోహిత్ చౌహాన్ ఆలపించారు. బాలాజీ సాహిత్యం అందించారు. ఇందులో జాన్వీకపూర్ అచ్చియ్యమ్మగా కనిపించనున్నారు.

## కెవిఎన్ ప్రొడక్షన్‌లో రావిపూడి



**టాకీస్:** ఈతరం దర్శకుల్లో దర్శకుడు అనిల్ రావిపూడి వినోదం ప్రధానంగా ఆయన సినిమాలుంటాయి. ఈ ఏడాది సంక్రాంతికి వెంకటేశ్‌తో 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో భారీ విజయాన్ని అందుకున్నారు. వచ్చే ఏడాది మెగాస్టార్ చిరంజీవితో 'మన శంకర వరప్రసాద్‌గారు' సినిమాతో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నారు. అయితే తాజాగా ఆయన గురించి ఓ వార్త నెట్టింట చక్కర్లు కొడుతుంది. దక్షిణాదిలో భారీ సినిమాలు చేస్తున్న కెవిఎన్ ప్రొడక్షన్‌లో ఓ సినిమా చేయబోతున్నారని వార్తలొచ్చాయి. ఆ వార్తలు నిజమే అన్నట్లు ఆదివారం అనిల్ రావిపూడి పుట్టినరోజు సందర్భంగా క్లారిటీ ఇచ్చారు. ఈ మేరకు ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ నిర్మాణ సంస్థ ఓ పోస్ట్ పెట్టడంతో ఈ కాంబోలో సినిమా ఖాయమని క్లియర్ అయింది. అయితే ఇందులో హీరో ఎవరు? అనే వివరాలు వెల్లడించలేదు. ఇదే బ్యానర్‌లో చిరంజీవి - బాబీ కొల్లి సినిమా, యష్, విజయ్ ప్రాజెక్టులు ఉన్నాయి. అలాగే పవన్‌కల్యాణ్, లోకేశ్ కనకరాజ్ కాంబోలో కూడా ఓ సినిమా ఉంటుందని టాక్ నడుస్తోంది.

## సంక్రాంతి రేసు నుంచి
# తప్పుకున్న నవీన్ పోలిశెట్టి?

**టాకీస్:** యంగ్ హీరో నవీన్ పోలిశెట్టి, మీనాక్షీ చౌదరి జంటగా మారి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం అనగనగా ఒక రాజు. సితార ఎంటర్ టైన్మెంట్స్ బ్యానర్ పై సూర్య దేవర నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాడు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, ప్రమోషనల్ కంటెంట్ అంతా మంచి ఆదరణను అందుకున్నాయి.



ఎన్నో ఏళ్లగా ఈ సినిమా రిలీజ్ కోసం ఎదురుచూస్తూ ఉంది. ఎట్టకేలకు వచ్చే ఏడాది సంక్రాంతి బరిలో రాజుగారు దిగుతున్నారు అంటూ మేకర్స్ ప్రకటించారు. దీంతో అందరూ ఈ సినిమా కోసం ఎదురుచూస్తూ ఉన్నారు. ఈ మధ్యనే నవీన్ పోలిశెట్టి ప్రమోషన్స్ తో అదరగొట్టాడు. అయితే అది కూడా మూడునాళ్ళ ముచ్చటగా మారిపోయింది. అందుతున్న సమాచారం ప్రకారం ఈ సంక్రాంతి బరిలో కూడా రాజుగారు రావడం లేదని తెలుస్తోంది. చిరంజీవి మన శంకర వరప్రసాద్ గారు, ప్రభాస్ ది రాజా సాబ్, రవితేజ భర్త మహాశయులకు విజ్ఞప్తి, విజయ్ జన నాయగన్, శర్వానంద్ నారీ నారీ నడుమ మురారి లైన్‌లో ఉన్నాయి. ఇక ఇన్ని సినిమాలతో పోటీ తట్టుకోలేక రాజుగారు డ్రాప్ అయ్యారని, సంక్రాంతి రేసు నుంచి నవీన్ తప్పుకున్నాడని వార్తలు వస్తున్నా యి. అందుకే ప్రమోషన్స్ కూడా మధ్యలోనే ఆపేశారని సమాచారం. త్వరలోనే ఈ విషయాన్ని మేకర్స్ అధికారికంగా తెలప నున్నారట. మరి ఇందులో నిజమెంత అనేది తెలియాల్సి ఉంది.




# నేను క్షేమంగానే ఉన్నా..

నేను క్షేమంగానే ఉన్నా..

టాకీస్: నటి శ్రద్ధాకపూర్ ప్రస్తుతం 'ఈఠా'లో నటిస్తోన్న విషయం తెలిసిందే. ఇటీవల ఈ సినిమా షూటింగ్‌లో ఆమె కాలుకు గాయమైంది. దీంతో అభిమానులు ఆందోళన చెందారు. తాజాగా తన హెల్త్ అప్‌డేట్‌ను శ్రద్ధా పంచుకున్నారు. విశ్రాంతి తీసుకుంటున్నట్లు తెలిపారు. ఒక అభిమాని గాయం ఎలా ఉందని పోస్ట్ పెట్టగా దానికి ఆమె రిప్లై ఇచ్చారు. "పెద్ద దెబ్బ ఏం కాదు.. కాలి కండరానికి దెబ్బ తగిలి కొంచెం ఫ్రాక్చర్ అయింది. డాక్టర్లు విశ్రాంతి తీసుకోమన్నారు. నేను క్షేమంగానే ఉన్నా. త్వరలోనే మీ ముందుకు వస్తాను" అని చెప్పారు. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో 'ఈఠా' తెరకెక్కుతోంది. ఇటీవల నాసిక్‌లో ఒక భారీ సెట్ వేసి షూటింగ్ నిర్వహిస్తుండగా శ్రద్ధా కాలికి గాయమైంది. భారీ కాస్ట్యూమ్స్ ధరించి డ్యాన్స్ వేస్తుండగా ప్రమాదం జరిగింది. ఎడమ కాలుకు గాయం కావడంతో షూటింగ్‌ను కొన్ని రోజులు నిలిపివేశారు . ఈ సినిమా కోసం ఆమె 15 కిలోల బరువు పెరిగినట్లు కూడా వార్తలు వచ్చాయి.

## ప్రభాస్ ఇమేజ్‌కు
# తగ్గట్లుగా రాజాసాబ్
### పాట విడుదల సందర్భంగా దర్శకుడు మారుతి
### ఎన్టీఆర్ అభిమానులకు క్షమాపణలు



**టాకీస్:** ప్రభాస్ అభిమానులు తనపై పెట్టుకున్న నమ్మకానికి మించి 'ది రాజాసాబ్' ఉంటుందని దర్శకుడు మారుతి అన్నారు. ప్రభాస్ హీరోగా ఆయన దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'ది రాజాసాబ్'. తాజాగా ఈ సినిమా నుంచి 'రెబల్ సాబ్' అనే పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా మారుతి మాట్లాడుతూ.. ఈ చిత్రం విడుదలైన రోజు థియేటర్లు కేరింతలతో మార్మోగిపోవడం ఖాయమన్నారు. అందుకు తనదే హామీ అని చెప్పారు. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా కనిపించనున్న ఈ చిత్రం జనవరి 9న విడుదల కానుంది. ప్రభాస్ కథానాయకుడిగా మారుతీ దర్శకత్వంలో రూపొందుతున్న రొమాంటిక్ కామెడీ హారర్ ఫిల్మ్ 'ది రాజా సాబ్' సంక్రాంతి కానుకగా జనవరి 9న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం ఒక్కో అప్‌డేట్ ఇస్తోంది. ఈ సినిమా నుంచి మొదటి పాట 'రెబల్ సాబ్'ను విడుదల చేసింది. తమన్ స్వరాలు సమకూర్చిన పాట ప్రస్తుతం ట్రెండ్ అవుతోంది. ఇకపోతే మారుతి వివాదంలో చిక్కారు. మైక్ ముందు ఉంది కదా అని ఏదో ఒకటి అనేస్తున్నారు.. ట్రోల్స్ కు గురవుతున్నారు.. మళ్లీ తిరిగి క్షమాపణలు కోరుతున్నారు. తాజాగా డైరెక్టర్ మారుతీ.. ఎన్టీఆర్ ఫ్యాన్స్ కు క్షమాపణలు చెప్పాడు.రిలీజ్ డేట దగ్గరపడుతుండడంతో ప్రమోషన్స్ మొదలుపెట్టిన మారుతీ.. రాజా సాబ్ నుంచి రెబల్ సాబ్ అంటూ సాగే సాంగ్ ను రిలీజ్ చేశారు. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్ లో మారుతీ.. ఎన్టీఆర్ ని అవమానించడంటూ ఫ్యాన్స్ రచ్చ చేయడం మొదలుపెట్టారు. ఈ ఈవెంట్ లో మారుతీ మాట్లాడుతూ.. 'కాలర్ ఎగరేసుకుంటారు.. అట్లా చెప్పను. ఎందుకంటే అవ్వన్నీ ఆ కట్ అవుట్ ముందు చాలా చిన్నవి అయిపోతాయి. నేను ప్రస్తుతం రెబెల్ యూనివర్సిటీలో చదువుకుంటున్నా. ప్రభాస్ ఫోటో జేబులో ఉంటే చాలు ఎలాంటి డైరెక్టర్ అయిన టాప్ డైరెక్టర్ అయిపోతాడు' అంటూ చెప్పుకొచ్చాడు. వార్ 2 ఈవెంట్ లో ఎన్టీఆర్ ఇలానే కాలర్ ఎగరవేసి తమ సినిమా హిట్ అవుతుందని చెప్పాడు. ఇప్పుడుమారుతీ ఎన్టీఆర్ నే అన్నాడని, తమ హీరోని పొగడడంలో తప్పు లేదు కానీ, వేరే హీరోతో కంపేర్ చేయడం .. ఆ హీరోని అవమానించడమే అని చెప్పుకొస్తున్నారు. ఇక ఈ విషయం పెద్దది కాకుండా మారుతీ ఆదిలోనే తుంచేశాడు. ఫ్యాన్స్ కి సారీ చెప్పి ఈ వివాదానికి ఫుల్ స్టాప్ పెట్టాడు. ' ముందుగా నేను ప్రతి అభిమానికి హృదయపూర్వకంగా క్షమాపణలు కోరుతున్నాను. ఎవరినీ బాధపెట్టడం లేదా అగౌరవపరచడం నా ఉద్దేశ్యం కాదు. కొన్నిసార్లు మాటల ప్రవాహంలో మనం అనుకున్న మాటలు అనుకున్నట్లు రాకపోవచ్చు. నేను అన్న మాటలు వేరే విధంగా అర్థం చేసుకున్నందుకు నేను చింతిస్తున్నాను.ఎన్టీఆర్ గారి పట్ల మరియు ఆయన అభిమానులందరి పట్ల నాకు అపారమైన గౌరవం ఉంది. సినిమా పట్ల,మీ హీరో పట్ల మీరు చూపే ప్రేమకు నేను నిజంగా విలువ ఇస్తున్నాను. ఇది నేను ఉద్దేశ్యపూర్వకంగా చేయలేదని మనస్ఫూర్తిగా చెప్తున్నాను. ఈ విషయాన్ని అభిమానులు అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాను' అంటూ చెప్పుకొచ్చాడు.

# ఫిబ్రవరి 13న స్వయంభు విడుదల
### భారీ అంచనాలతో నిర్మాణం



**టాకీస్:** ఒక సినిమా.. రెండు సంవత్సరాల కష్టం.. పదుల సంఖ్యలో సెట్స్.. వేల సవాళ్లు..' అంటూ 'స్వయంభు' విడుదల తేదీని ప్రకటించారు హీరో 'నిఖిల్'. ఆయన ప్రధానపాత్రలో భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం రూపొందుతోంది. సంయుక్త, నభా నటేశ్ కథానాయికలు. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 13న విడుదల కానున్నట్లు తెలుపుతూ వీడియో విడుదల చేశారు. హీరో నిఖిల్ సిద్ధార్థ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న పీరియడ్ వార్ యాక్షన్ డ్రామా 'స్వయంభు' మరోసారి వార్తల్లోకి వచ్చింది. కొంతకాలంగా చిత్ర బృందం నుంచి ఎలాంటి అప్డేట్ రాకపోవడంతో ఫ్యాన్స్ నిరుత్సాహంలో ఉన్నారు. అయితే , ఈ రోజు మేకర్స్ చిత్రం విడుదల తేదీని ప్రకటించారు. 'కార్తికేయ 2'తో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన నిఖిల్ ఇప్పుడు మళ్లీ పాన్ వరల్డ్ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. మొదటిసారి దర్శకుడిగా మారుతున్న భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ యాక్షన్ డ్రామా వచ్చే ఫిబ్రవరి 13న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. సినిమా మొత్తం ఎనిమిది భాషల్లో విడుదల కానుంది. తెలుగు, హిందీ, తమిళ్, కన్నడ, మలయాళం, చైనీస్, స్పానిష్, అరబిక్ భాషలలో మూవీని రిలీజ్ చేయనున్నారు. సినిమా షూటింగ్ ఇప్పటికే పూర్తయిందని టీమ్ వెల్లడించింది. విడుదల తేదీ ప్రకటించిన సందర్భంగా, మేకర్స్ 'రైజ్ ఆఫ్ స్వయంభు' అనే స్పెషల్ వీడియోను రిలీజ్ చేశారు. ఇందులో చిత్రంలోని భారీ స్కేల్, యుద్ధ సన్నివేశాలు, పీరియడ్ సెట్లు, నిఖిల్ లుక్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ వీడియోతో చిత్రం పై ఉన్న హైప్ మరింత పెరిగింది. త్వరలో ప్రమోషన్లు పెద్ద ఎత్తున ప్రారంభం కానున్నాయి. ఈ చిత్రంలో సమ్యుక్తా, నభా నటేష్ హీరోయిన్లుగా కనిపించనున్నారు. ఇద్దరి పాత్రలు కూడా ప్రత్యేకంగా డిజైన్ చేసినట్టు సమాచారం. ఈ భారీ చిత్రాన్ని పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భువన్, శ్రీకర్ నిర్మిస్తుండగా, ప్రముఖ నిర్మాత టాగూర్ మధు ఈ సినిమాను ప్రెజెంట్ చేస్తున్నారు. సినిమాటోగ్రఫీ కె.కె. సెంథిల్ కుమార్ కాగా, ఇప్పటికే భారీ చిత్రాలకు కెమెరా వర్క్ అందించిన ఆయన విజువల్స్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణ కానున్నాయి. రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. యుద్ధ నేపథ్యం, భారీ సెట్స్, ఇంటెన్స్ కథ, పాన్-వరల్డ్ విడుదల ..ఈ అంశాలన్నీ కూడి 'స్వయంభు'ను నిఖిల్ కెరీర్‌లో అత్యంత భారీ ప్రాజెక్ట్‌గా నిలబెడుతున్నాయి. విడుదల తేదీ అనౌన్స్‌మెంట్ తర్వాత పోస్టర్లు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 2026 ఫిబ్రవరి వరకు కొత్త అప్డేట్లు, పోస్టర్లు, ట్రైలర్లు వరుసగా విడుదలయ్యే అవకాశం ఉంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.